




రైల్వే వ్యాగన్ల నుంచి లారీల్లోకి సరఫరా అవుతున్న యూరియా

రైతులకు ఊరట

రైతుల యూరియా కష్టాలు తీరనున్నాయి. జిల్లాకు సమృద్ధిగా యూరియా నిల్వలు చేరుకుంటున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు యూరియా కొరతపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రత్యేకంగా కేటాయింపులు జరిపించారు. రెండు రోజుల్లో 5,200 టన్నులు చేరుకోవడంతో చాలా వరకు యూరియా సమస్య సద్దుమణిగింది. హోల్‌సేల్, రిటైల్ ఎరువుల దుకాణాలు, గోదాములపై విస్తృత తనిఖీలు జరుగుతూనే ఉన్నాయి. 20 రోజుల్లోనే 104 షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులతో పాటు కలెక్టర్ రాజకుమారి రైతులకు భరోసానిస్తున్నారు. ఎలాంటి నిల్వలు చేసుకోవద్దని, అవసరాన్ని బట్టి ఎరువులను వాడాలని కలెక్టర్ కోరుతున్నారు.



- జిల్లాకు భారీగా చేరుతున్న యూరియా
- ఇప్పటికే 44,378 మెట్రిక్ టన్నులు విక్రయం
- ఈ నెలాఖరులోపు మరో 10వేల టన్నులు
- విస్తృతంగా కొనసాగుతున్న తనిఖీలు
- అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు : కలెక్టర్

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులకు కూటమి ప్రభుత్వం ఊరట కల్పిస్తోంది. యూరియా పెద్దఎత్తున జిల్లాకు చేరుకుంటోంది. ఖరీఫ్ ప్రారంభానికి ముందే వర్షాలు కురవడం, డిమాండ్‌కు తగ్గ యూరియా అందుబాటులో ఉందని అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో కొంతమేర రైతులు ఇబ్బందులు పడ్డారు. ఖరీఫ్ ప్రారంభ సమయంలోనే జిల్లా డీఏవో, ఏడీలు, ఏవోలు బదిలీల ప్రభావం యూరియాపై పడిందనే చెప్పవచ్చు. సరైన పర్యవేక్షణ లేక కేటాయింపులు జరగడం, కొందరు వ్యాపారులు యూరియాను బ్లాక్ చేయడం, రైతులు కూడా పెద్ద ఎత్తున నిల్వలు చేయడం వంటి ప్రభావం యూరియాపై పడింది. పరిస్థితిని గమనించిన కలెక్టర్ రాజకుమారి ఏ రోజుకారోజు నిల్వలపై ఆరా తీస్తూ ప్రత్యేక దృష్టిసారించారు. పోలీసు, రెవెన్యూ, వ్యవసాయాధికారులను కలిపి టీమ్‌లుగా ఏర్పాటుచేసి దాడులు చేయించారు. సీఎం చంద్రాబాబునాయుడు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ల దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాకు ప్రత్యేకంగా యూరియా కేటాయింపులు జరిపించారు. జిల్లాకు రెండు రోజుల్లో 5,200 టన్నులు చేరుకోవడంతో చాలావరకు యూరియా సమస్య సద్దుమణిగింది.

రైతులకు భరోసా

జిల్లాకు ఇప్పటికే 44,378 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయించారు. మార్క్‌ఫెడ్ ద్వారా 18,006 మెట్రిక్ టన్నులు, రిటైల్ వ్యాపారుల ద్వారా 26,372 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు విక్రయించారు. సెప్టెంబర్ నెలాఖరులోపు జిల్లాకు మరో 10వేల టన్నుల యూరియా రాబోతోంది. వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులతో పాటు కలెక్టర్ రాజకుమారి రైతులకు భరోసానిస్తున్నారు. రైతులు ఎలాంటి నిల్వలు చేసుకోవద్దని, అవసరాన్ని బట్టి ఎరువులను వాడాలని కలెక్టర్ కోరుతున్నారు. డీలర్లు, రిటైల్ వ్యాపారులు ఏ మాత్రం అవతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తూనే దాడులను విస్తృతం చేశారు.

మంగళవారం కూడా 2,600 టన్నులు చేరుకోగా, 13వ తేదీ 1,500 టన్నుల యూరియా జిల్లాకు చేరుకోనుంది. మరోవైపు హోల్‌సేల్, రిటైల్ ఎరువుల దుకాణాలు, గోదాములపై విస్తృత తనిఖీ జరుగుతూనే ఉన్నాయి.

విస్తృతంగా తనిఖీలు

కలెక్టర్ ఆదేశాల మేరకు నియమించిన అధికారుల టీమ్‌లు అన్ని మండలాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. 20రోజుల్లోనే 104 షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. అందులో ఏడు షాపులపై 6ఏ కేసులు నమోదు చేయగా ఒక్క షాపు లైసెన్స్‌ను రద్దు చేశారు. రూ.8.62లక్షల విలువ చేసే 69,215 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశారు.



గోదాములను తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

87 శాతం మేర పంటలు..

జిల్లాలో రైతులు 87శాతం మేర వివిధ రకాల పంటలను వేశారు. ఈఏడాది 5,88,478 ఎకరాలు లక్ష్యంగా కాగా నేటికి 5,10200 ఎకరాల్లో పంటలు వేశారు. మరో 20,150 ఎకరాల్లో పంటలు వేసే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు లెక్కలు తేల్చారు. ప్రధానంగా మొక్కజొన్న పంటను అధికంగా వేశారు. వ్యవసాయాధికారుల అంచనాల మేరకు 1,33,750 ఎకరాల లక్ష్యం కాగా, 1,54,010 ఎకరాల్లో అంచనాలకు మించి మొక్కజొన్న వేయడంతో ఎరువుల సమస్య ఉత్పన్నమైంది. పెసర పంట 23,959 ఎకరాలు లక్ష్యం కాగా 25,897 ఎకరాల్లో వేశారు. వరి పంట 1,61,179 ఎకరాల లక్ష్యం కాగా ఇప్పటికే 1,46,712 ఎకరాల్లో వరి వేశారు. ఉద్యానపంటలు 67523 ఎకరాలు లక్ష్యంగా కాగా ప్రస్తుతం 35,198 ఎకరాల్లో సాగుచేశారు.

మల్లన్న ఆలయంపై డ్రోన్ చక్కర్లు

అప్రమత్తమైన దేవస్థానం, భద్రతా విభాగం అధికారులు



మల్లన్న ఆలయ శిఖరంపై డ్రోన్

శ్రీశైలం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలం మల్లన్న ఆలయంపై సోమవారం రాత్రి డ్రోన్ చక్కర్లు కొట్టడం కలకలం రేపింది. ఆలయంపై డ్రోన్ ఎగరడంతో దేవస్థానం, భద్రతా విభాగం అధికారులు అప్రమత్తమయ్యారు. భద్రతా రీత్యా దేవస్థానంపై డ్రోన్‌లు ఎగురవేయడం నిషిద్ధం. దీనిపై విచారణ సాగుతోంది. క్షేత్ర పరిధిలో డ్రోన్ ఎగురవేసిన దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ సంఘటన పలు అనుమానాలకు తావిస్తోంది.

విచారణ చేపడతాం : శ్రీనివాసరావు, ముఖ్య భద్రతాధికారి, శ్రీశైలం

శ్రీశైలం మల్లన్న ఆలయంపై డ్రోన్ ఎగరడంపై విచారణ చేపడుతున్నాం. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

కాణిపాకం వినాయకుడికి పట్టు వస్త్రాలు సమర్పణ



పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి

మహానంది, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా కాణిపాకం వరసిద్ధి వినాయకుడి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మహానంది ఆలయం తరుపున ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం వేదపండితులు, అర్చకులు పట్టు వస్త్రాలు సమర్పణ సమర్పించారు. కాణిపాకం ఆలయ ఈవో పెంచల కిషోర్ వీరికి స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంప్రదాయం ప్రకారం మహానంది ఆలయం తరుపున కాణిపాకం బ్రహ్మోత్సవాలకు పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ అని, ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా అందచేసామని ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ మధు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తీసుకువచ్చిన ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం నగరంలోని 'కుడా' కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అప్రూవల్ లేకుండా భవనాలు నిర్మించకూడదన్నారు. ఐదేళ్ల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇళ్లు, భవనాలు నిర్మించుకున్నారన్నారు. ప్రభుత్వానికి ఎలాంటి రుసుములు చెల్లించడం లేదన్నారు. అనుమతులు లేకుండా వ్యాపారం చేస్తే వాటిని కూల్చడానికి ప్రభుత్వానికి అధికారం ఉందన్నారు. మరిన్ని వివరాలకు మున్సిపాలిటీ, 'కుడా' కార్యాలయాల్లో సంప్రదించాలని ఆయన సూచించారు.

నేటి నుంచి పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు బుధవారం నుంచి మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా పంచాయతీ వనరుల శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ జి.నాసరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని 53 మండలాల నుంచి ప్రతి మండలం నుంచి ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు శిక్షణకు హాజరు అవుతారని చెప్పారు. సొంత ఆదాయ వనరుల అంశంపై జడ్పీ ఆవరణలోని జిల్లా పంచాయతీ వనరుల శిక్షణ కేంద్రంలో ఈ శిక్షణ ఉంటుందని చెప్పారు. గ్రామ పంచాయతీ అభివృద్ధికి సొంత ఆదాయ వనరుల సృష్టి, స్వంత ఆదాయంలో పన్ను వనరుల, పన్ను వసూళ్లతో ఎదురయ్యే సవాళ్లపై అవగాహన కల్పిస్తారన్నారు.

కొలనుభారతిలో సీసీ కెమెరాల ఏర్పాటు

- హర్షం వ్యక్తం చేస్తున్న భక్తులు

కొత్తపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని జ్ఞానసరస్వతి అమ్మవారి క్షేత్రమైన కొలనుభారతిలో ఆరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో రామలింగారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గతంలో ఆలయ పురోహితులు, సిబ్బంది తరుచూ గైర్హాజరవుతూ భక్తులకు ఇబ్బందులు కలిగిస్తున్నారన్న నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం సీసీ కెమెరాలతో పాటు బయోమెట్రిక్ కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 8 గంటలకు గర్భాలయ తలుపులు తెరవాలని మధ్యాహ్నం 1 గంటకు భోజన విరామం, తిరిగి 2.30 నుంచి 5 గంటల వరకు అమ్మవారి ఆలయం తెరిచి ఉంచి భక్తులకు దర్శనం కల్పించాలని ఈవో తెలిపారు. పురోహితులు, సిబ్బంది ఏదైనా అత్యవసర పనులు ఉంటే నెలకు నాలుగు సెలవులు ఉపయోగించుకోవచ్చన్నారు. ఈవో అనుమతి లేకుండా విధులకు గైర్హాజర్ అయితే చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయంలో నలుగురు పురోహితులతో పాటు ఆరు మంది సిబ్బంది ఒక నైట్ వాచ్‌మెన్ విధులు నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు.

ఓటేసిన ఎంపీ శబరి

నంద్యాల రూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఢిల్లీలోని పార్లమెంట్ నూతన భవనం ఎఫ్-101 వసుధలో నిర్వహించిన పోలింగ్‌లో ఆమె ఓటు వేశారు. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ కు అనుకూలంగా ఆమె ఓటు వేసినట్లు సమాచారం.



ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న ఎంపీ

చెత్తరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం

- మున్సిపల్ వ్యవస్థను సర్వనాశం చేసిన వైసీపీ
- వారి పాపాలే.. ఆ శాఖకు శాపాలు
- 85లక్షల టన్నుల చెత్తను వదిలివెళ్లింది
- మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ
- డోన్‌లో విస్తృత పర్యటన
- ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే, నాయకులు

డోన్ టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏపీని చెత్తరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. మంగళవారం మంత్రి డోన్‌లో పర్యటించారు. ఆయనకు ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు ఘన స్వాగతం పలికారు. డోన్ డంపింగ్ యార్డులో లెగసి వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంటు పనులను ఎమ్మెల్యేతో కలిసి మంత్రి నారాయణ పరిశీలించారు. చెత్త తొలగింపు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ చేసిన రాష్ట్రాన్ని, మున్సిపల్ వ్యవస్థను సర్వనాశనం చేశాయన్నారు. వారు చేసిన అరాచకాలు, అవకతవకల నుంచి రాష్ట్రం ఇప్పుడిప్పుడే బయట పడుతుందని అన్నారు. చెత్త పన్ను పేరుతో వైసీపీ ప్రభుత్వం ప్రజలను పీడించిందన్నారు. 85 లక్షల టన్నుల చెత్తను వదిలి వెళ్లిందని, వారు వదిలి వెళ్లిన చెత్తను తాము తొలగిస్తున్నామన్నారు. అక్టోబరు 2వ తేదీ గాంధీ జయంతి నాటికి ఈ చెత్తనంగా పూర్తి స్థాయిలో తొలగించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారన్నారు. రాష్ట్రంలో రీసైక్లింగ్ పనులు శరవేగంగా సాగుతున్నాయని చెప్పారు. ఇప్పటికే 79 లక్షల టన్నుల చెత్తను తొలగించామని, ఇంకా 6 లక్షల టన్నుల చెత్త మిగిలి ఉందని తెలిపారు. ఒక్క డోన్‌లో 50వేల టన్నుల చెత్తకు గానూ 36వేల టన్నులు తొలగించామన్నారు. భవిష్యత్తులో చెత్త సమస్య లేకుండా వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌లు ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో డంపింగ్ యార్డులే లేకుండా చేయాలన్నది సీఎం చంద్రబాబు ఆలోచన అని వివరించారు. ఒక వైపు 10 లక్షల కోట్ల అప్పు కడుతూ మరో వైపు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లగా ముందుకు సాగుతున్నామన్నారు. ఉన్నత ఉద్దేశంతో ప్రారంభించిన టిడ్కో ఇళ్లను కూడా గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, వచ్చే మార్చి నాటికి టిడ్కో ఇళ్ల సమస్యను కూడా పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు. డంప్ యార్డు పరిశీలించిన అనంతరం పట్టణంలోని ఎమ్మెల్యే కోట్ల స్వగృహానికి చేరుకుని అల్పాహారం చేసిన అనంతరం మంత్రి అనంతపురానికి బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, ఆర్డీవో కేసీ నరసింహులు, తహసీల్దార్ రవికుమార్, మున్సిపల్ డీఈ రఘు, ఏఈ సురేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వలసల రామకృష్ణ, కోట్రికే ఫణిరాజ్, టీడీపీ అధికార ప్రతినిధి విజయభట్టు, భాస్కర్ నాయుడు, మండల అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, సర్పంచ్ అర్జున్‌రెడ్డి, కోట్రికే హరికిషన్, పెద్ద కేశవయ్యగౌడు, చిన్న మల్కాపురం సుధాకర్ రెడ్డి, వాస్తు లక్ష్మన్న, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు ఉన్నారు.



డోన్ డంప్ యార్డులో పర్యటిస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే కోట్ల

శ్రీశైలం సబ్ డీఎఫ్‌ఓగా బబిత కుమారి

నంద్యాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అటవీ శాఖలో కీలక అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా శ్రీశైలం సబ్ డీఎస్‌ఓగా బబిత కుమారి బదిలీ అయ్యారు. 2023 సివిల్స్ రాసిన ఆమె ఐఎఫ్‌ఎస్‌కు ఎంపికయ్యారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఆమెను శ్రీశైలం ఫారెస్ట్ ప్రాంతానికి సబ్ డీఎఫ్‌ఓగా నియమించారు. అదేవిధంగా దోర్నాల-మార్కాపురం సబ్ డీఎఫ్‌ఓగా నీరజ్ హాన్స్, గిద్దలూరు సబ్ డీఎఫ్‌ఓగా కొప్పుల బాలరాజును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

పెద్ద పరిశ్రమతో పేద రైతు పోరాటం 7

పని మనిషే ప్రాణం తీసింది..

ఆలయాలే టార్గెట్‌గా.. 7

- హల్‌చల్ చేసిన దొంగలు
- తాళాలు పగలగొట్టారు



మూలపెద్దమ్మ ఆలయంలో వివరాలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్

సంక్షోభంలో వ్యవసాయ రంగం

- రైతులందరికీ యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలం
- 'అన్నదాత పోరు'లో వైసీపీ నాయకులు



ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న వైసీపీ నాయకులు

నంద్యాల రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ఆరోపించారు. యూరియా బ్లాక్ మార్కెట్‌పై 'అన్నదాత పోరు'లో భాగంగా మంగళవారం బొమ్మలసత్రం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆర్డీవో చల్లా విశ్వనాథ్‌కు వినతి పత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ యూరియా దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పొలాలను వదిలి యూరియా కోసం టీడీపీ నాయకుల నివాసాల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. యూరియా పంపిణీలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. యూరియా పుష్కలంగా ఉందని ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు చెబుతున్నారని, ఎక్కడ ఉందో చూపాలని డిమాండ్ చేశారు. రైతులకు పార్టీలు అంటగట్టడం మంచి పద్ధతి కాదన్నారు. పార్టీలకు అతీతంగా యూరియా పంపిణీ చేయాలని కోరారు. పంటలకు గిట్టుబాటు ధర ఎందుకు కల్పించడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, నంద్యాల మున్సిపల్ చైర్మన్ మాబున్నీసా, ఎంపీపీ ప్రభాకర్ పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించడం లేదు



మెడికల్ కాలేజీలో మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి ఫరూక్

- వైసీపీ తప్పుడు ప్రచారం
- మౌలిక సదుపాయాల మెరుగునకు కృషి
- రూ.4,500 కోట్లతో ఆస్పత్రుల అభివృద్ధికి శ్రీకారం
- న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యకళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరించడం లేదని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. మంగళవారం నంద్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీని సందర్శించారు. అక్కడ జరుగుతున్న పనులను అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో విద్యార్థులకు అందుతున్న సేవలు, వసతులపై ఆరాతీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చేసిన వినాశనం నుంచి రాష్ట్రాన్ని కాపాడటానికి కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టిందన్నారు. మెడికల్ కళాశాలలపై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. మెడికల్ కాలేజీల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చేందుకు, మరిన్ని వైద్య సీట్లను కల్పించడానికి పీపీపీ విధానాన్ని అవలంభిస్తోందన్నారు. వైద్యసేవలు ప్రజలకు అందుబాటులో ఉండేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకంటుందన్నారు. కూటమి ప్రభుత్వం అసంపూర్తి పనులను వేగంగా పూర్తిచేస్తూ పీపీపీ విధానం ద్వారా పదికొత్త మెడికల్ కాలేజీలను స్థాపిస్తోందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పూర్తిచేయకుండా వదిలేసిన మెడికల్ కాలేజీలను ఫేస్-1కింద మార్కాపురం, మదనపల్లె, పులివెందుల, ఆదోని కాలేజీలను త్వర గా పూర్తిచేస్తామన్నారు. 2027-28లోగా పూర్తిచేయడంతో ఒక్కో కాలేజీలో 150మెడికల్ సీట్లు అందుబాటులోకి వస్తాయన్నారు. కాలేజీల నిర్మాణం పూర్తయిన తర్వాత వాటి నిర్వహణ, యాజమాన్య హక్కులు పూర్తిగా ప్రభుత్వం వద్దనే ఉంటాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్యశాఖలో 3వేల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుందన్నారు. రూ.4,500కోట్లతో ఆస్పత్రుల అభివృద్ధికి శ్రీకారం చుట్టిందని మంత్రి ఫరూక్ వెల్లడించారు.



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి ఫరూక్

వంద శాతం అడ్మిషన్లు పూర్తి చేస్తాం

● ఉర్దూ యూనివర్సిటీ వీసీ పీఎస్ షాషావలి

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో 2025-26 విద్యాసంవత్సరానికి వంద శాతం అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేస్తామని వీసీ పీఎస్ షాషావలి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం ఈ ఏడాది 50 శాతం అడ్మిషన్లతో ముందంజలో ఉందన్నారు. రాష్ట్రంలోని వర్శిటీల్లో అడ్మిషన్ల ప్రక్రియ 24శాతం ఉండగా ఒక్క ఉర్దూ వర్సిటీలోనే అడ్మిషన్లు పెరగడం విశేషమన్నారు. ఈనెల 22 నుంచి రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుందని తెలిపారు. డిగ్రీ 3 కోర్సులు, పీజీలో 9 కోర్సుల్లో 330 మంది విద్యార్థులు విద్యార్థులు అడ్మిషన్లు పొందారన్నారు. 2016లో ప్రారంభమైన వర్సిటీలో మొదటి సారిగా అత్యధికంగా అడ్మిషన్లు పెరిగాయని వీసీ పేర్కొన్నారు.

అండర్-19 క్రీడా షెడ్యూల్ విడుదల

కర్నూలు స్పోర్ట్స్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అండర్-19 బాలబాలికల క్రీడా జట్ల ఎంపిక షెడ్యూల్‌ను జిల్లా వృత్తి విద్యాధికారి డాక్టర్ సురేష్ బాబు, ఆర్ఐఓ లాలెప్ప ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తేదీ ఆర్చరీ, షూట్బా, సెపక్‌తక్రా క్రీడల ఎంపిక కర్నూలు డీఎస్‌ఏ స్టేడియంలో జరుగుతాయి. ఈ నెల 11న ఫుట్‌బాల్ ఎమ్మిగనూరు ప్రభుత్వ కళాశాలలో, 12న ఫెన్సింగ్, కురాష్ ఉషూ డీఎస్‌ఏ స్టేడియంలో కర్నూలులో, 13న సైక్లింగ్, కరాటే మాల్కంబ్ సాఫ్ట్ టెన్నిస్ డీఎస్‌ఏ కర్నూలులో 15న జూడో, కవియర్ పట్టు నెట్‌బాల్, రైఫిల్ షూటింగ్ కర్నూలులో నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి రాఘవేంద్ర తెలిపారు. 1.1.2007 తర్వాత జన్మించిన వారు ఎస్ఎస్‌సీ జాబితాతో ఎంపికకు హాజరుకావాలన్నారు. వివరాల కోసం 9440864732ను సంప్రదించాలని తెలిపారు.



ఎస్‌జీఎఫ్ కార్యదర్శిగా రాఘవేంద్ర : కర్నూలు జిల్లా అండర్-19 కార్యదర్శిగా వీడీ రాఘవేంద్ర ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆయన సి.బెళగల్ ఏపీఎస్‌డబ్ల్యూఆర్ విద్యాసంస్థల్లో పీడీగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఇంటర్మీడియట్ బోర్డు రాఘవేంద్రను ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎంపిక చేసింది.

ఏ,బీ,సీ క్వార్టర్స్ ఖాళీ చేయిస్తున్నాం

● ఆర్డీవో సందీప్ కుమార్

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): లోకాయుక్త ఆదేశాల మేరకే నగరంలోని ఏ, బీ, సీ క్వార్టర్స్‌లో అక్రమంగా నివాసం ఉంటున్న వారిని ఖాళీ చేయిస్తున్నామని ఆర్డీవో సందీప్ కుమార్ మంగళవారం వెల్లడించారు. అక్రమంగా నివాసాలు ఉంటున్న వారు స్వచ్ఛందంగా ఖాళీ చేయాలని, ప్రజలందరూ ఈ విషయాన్ని తెలుసుకోవాలని ఆయన సూచించారు. ఇప్పటికే ఖాళీ చేయించే ప్రక్రియ చేపట్టినట్లు ఆయన తెలిపారు.

క్షణికావేశం.. అనర్థదాయకం..!

● ఒక్క క్షణం ఆగండి.. ఆలోచించండి
● బలవన్మరణం ఎంత వరకు సమంజసం?
● ఆత్మహత్యలతో జీవితాలే నాశనం
● ప్రతి వంద మరణాల్లో ఒక ఆత్మహత్య
● నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం




క్షణికావేశంలో తీసుకునే ఓ నిర్ణయం ఎన్నో అనర్థాలకు దారితీస్తోంది. ఆవేశానికో.. ఒత్తిడికో.. మనోవేదనకో లోనై తీసుకునే నిర్ణయం జీవితాలను నాశనం చేస్తోంది. బలవన్మరణానికి పాల్పడే ముందు ఒక్క క్షణం ఆగండి.. ఆలోచించండి. మనల్ని నమ్ముకొని మనమీద ఆధార పడి జీవించే వారు పరిస్థితి ఏమిటీ? చిన్నచిన్న సమస్యలకే కుంగిపోయి ఆత్మహత్యలకు పాల్పడటం ఎంత వరకు సమంజసం? తాము పోయినంత మాత్రాన సమస్యలు మాయమవుతున్నాయా? సమస్యలుంటే ఎదుర్కొని పోరాడాలి.. భయపడితే ఎలా? భయాన్ని జయించి జీవితాన్ని విజయం వైపు మళ్లించండి. అప్పుడే జీవన ప్రయాణం సాఫీగా సాగుతోంది. బలవన్మరణాలకు పాల్పడేవారిలో మనోధైర్యాన్ని నింపుద్దాం. ఆత్మహత్యలను నివారిద్దాం. 2003లో ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ సూసైడ్ ప్రివెన్షన్, డబ్ల్యూహెచ్‌వో సంయుక్తంగా ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినంను నిర్వహిస్తుంది. ఈ ఏడాది 'ఆత్మహత్యపై కథనాన్ని మార్చడం' అన్న నినాదాన్ని ఇచ్చింది. ఆత్మహత్యల నివారణల దినం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

● వెల్దుర్తి మండలానికి చెందిన ఓ రైతు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నారు. తనకున్న రెండున్నర ఎకరాలతో పాటు మరో ఆరు ఎకరాలు పొలం కౌలుకు తీసుకుని పంట సాగు చేశారు. గత ఏడాది పంటలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. ఈసారి కూడా 8 ఎకరాల్లో పంటలు వేసి దిగుబడులు రాని పరిస్థితి నెలకొంది. ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

● మంత్రాలయం మండలం మాలపల్లికి చెందిన 21 ఏళ్ల యువకుడు ఈ నెల 1వ తేదీ ఇంట్లో పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కర్నూలులో చికిత్స పొందుతూ ఈ నెల 6వ తేదీన మరణించాడు.

● మహానంది మండలం తమ్మడపల్లె గ్రామంలో 21 ఏళ్ల ఓ విద్యార్థి నంద్యాలలోని ఓ కాలేజీలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. కడుపునొప్పి భరించలేక ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.



సోషల్ మీడియా.. బెట్టింగ్‌లతోనే



17 నుంచి 25 సంవత్సరాలలోపు ఉండే యువతలో సోషల్ మీడియా, డ్రగ్స్, బెట్టింగ్‌లతోనే చాలా మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో పరిచయం కారణంగా ప్రేమలు పెరిగి, అవి విఫలం కావడంతో కూడా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పిల్లలు మొబైల్‌ను ఎలా చూస్తున్నారో తరుచూ తల్లిదండ్రులు గమనించాలి. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మెరుగు పరచాలి.

● డా.కంచర్ల హరిప్రసాద్, నరాలు, మానసిక వ్యాధి నిపుణుడు, సంఘమిత్ర క్లినిక్, కర్నూలు

ప్రవర్తనలో మార్పులను గమనించాలి



ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్న వారిలో ప్రవర్తన పరంగా చిన్న చిన్న మార్పులను గమనించాలి. ఆత్మహత్యలు ఎక్కువగా 15 నుంచి 24 ఏళ్ల వారిలో కనిపిస్తుంటాయి. ఆత్మహత్య ప్రయత్నాలు మహిళల్లో ఎక్కువగా ఉంటాయి. ఆత్మహత్యలతో చనిపోయే వారిలో మగవారే అధికంగా ఉంటారు. వ్యాయామం, యోగా, మెడిటేషన్, క్రీడలపై ఆసక్తి కలిగి ఆత్మస్థైర్యంతో ముందుకు వెళితే ఆత్మహత్యలను నివారించొచ్చు.

- డా.కే.సుహృత్ రెడ్డి, నరాలు, మానసిక వ్యాధుల నిపుణుడు, ఆశా కిరణ్ మైండ్ కేర్, కర్నూలు

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉన్నది ఒక్కటే జీవితం. దాన్ని అర్ధాంతరంగా కాలదన్నుకుంటే మన కథ అక్కడితోనే పరిసమాప్తమవుతుంది. ఏదో సాధించాలనే తపన.. ఏమీ సాధించలేదేనన్న నిరాశ.. ఇంకేమీ సాధించలేమోనన్న నిస్పృహ. ఇలాంటి స్థితిలోనే ఎంతోమంది నిండు జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారు. ఆత్మహత్యలకు తెగబడే ముందు ఒక క్షణం ఆగి.. తమను తాము ప్రశ్నించుకుంటే ఎన్నో జీవితాలు నిలబడుతాయి. తిరిగి పచ్చగా కళకళలాడుతాయి. ఇందుకు మనమంతా కలిసికట్టుగా ప్రయత్నించడం అత్యవసరమని ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం గట్టిగా నినదిస్తోంది.

● రోజూ వార్త పత్రికల్లో కనిపించే ఆత్మహత్యల వార్తలు చదివి అయ్యో అనుకుంటాం. చావాలనుకుంటే కనిపించేది ఒక్కటే కారణం. కానీ బతకడానికి వేయి కారణాలున్నాయి. తీవ్రమైన నిర్ణయం తీసుకోవడానికి ప్రేరేపిస్తున్న పరిస్థితులేమిటీ? అందులో సమాజం బాధ్యత ఎంతో ఉంది.

హెచ్చరిక సంకేతాలపై కన్నేయండి

ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్న వారిలో ప్రవర్తనా పరంగా కొన్ని మార్పులు స్పష్టంగా కనిపిస్తుంటాయి. ఈ మార్పులు కనిపిస్తే ఆలస్యం చేయరాదు. ఒంటరిగా ఉండడానికి ఇష్టపడటం. స్నేహితులకు, బంధువులకు దూరంగా ఉండటం, పండుగలు, వివాహాల వంటి వేడుకల్లో పాల్గొనకపోవడం. సామాజిక కార్యక్రమాలంటే ఆసక్తి లేకపోవడం. ఆత్మహత్య లేఖలు రాయడానికి ప్రయత్నించడం చావు గురించి ఎక్కువగా మాట్లాడటం.

రైతులకు రెండు పూటలా భోజనం ఏర్పాటు చేయాలి

● ఎక్కువ కాలం నిల్వ ఉండే ఉల్లిని జిల్లాలో సాగు చేయించండి
● కలెక్టర్ రంజిత్ బాషా



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో రైతులకు రెండు పూటలా భోజనం ఏర్పాటు చేయాలని కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ అమ్మకానికి ఉల్లిని తీసుకువస్తున్నారని, కొన్ని సమయాల్లో ఒక్కరోజులోనే ఉల్లి అమ్మకాలు జరగకపోవడం వల్ల రైతులు రాత్రి కూడా ఉండాల్సిన పరిస్థితి నెలకొంటోందని అన్నారు. అందువల్ల రైతులకు రాత్రి సమయంలో కూడా తక్కువ ధరకే భోజనం అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రంజిత్‌బాషా సెక్రటరీ జయలక్ష్మిని ఆదేశించారు. మధ్యాహ్నం రూ.15కు భోజనం అందిస్తున్నామనీ, కలెక్టర్ ఆదేశాలపై రాత్రి కూడా కేవలం రూ.10కే భోజనం అందిస్తామని కలెక్టర్‌కు సెక్రటరీ వివరించారు. మంగళవారం కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి అమ్మకాలు ఎలా జరుగుతున్నాయో కలెక్టర్ రంజిత్ బాషాతో పాటు జాయింట్ కలెక్టర్ నవ్య, ఎస్పీ విక్రాంత్ పాటిల్, మార్కెటింగ్‌శాఖ జేడీ రామాంజనేయులు తదితరులు పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కూడా మహారాష్ట్ర రైతుల మాదిరి ఎక్కువ కాలం మన్నిక వచ్చే ఉల్లిని సాగు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, రైతులకు అవగాహన కల్పించాలని ఉద్యాన శాఖ జిల్లా అధికారికి సూచించారు. కర్నూలు మార్కెట్ కమిటీ సెక్రటరీ మాట్లాడుతూ మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి 14,325 క్వింటాళ్ల ఉల్లిని రైతులు అమ్మకానికి తెచ్చారని, అందులో 6,749 క్వింటాళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారని, మిగిలిన 7,576 క్వింటాళ్ల ఉల్లిని మార్క్‌ఫెడ్ అధికారులు కొనుగోలు చేశారని వివరించారు. మంగళవారం రైతులకు జమ కావాల్సిన మొత్తాన్ని సంబంధించి రూ.కోటిని రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేసేందుకు చర్యలు తీసుకున్నామని మార్క్‌ఫెడ్ డీఎం రాజు తెలిపారు. కర్నూలు మార్కెట్ యార్డుకు ఒక్కో కమీషన్ ఏజెంటు రైతుల నుంచి 400 బస్తాల కన్నా ఎక్కువ ఉల్లిగడ్డలు తెప్పించకూడదని తెలియజేశామని సెక్రటరీ జయలక్ష్మి కలెక్టర్‌కు వివరించారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తులు

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత ఎయిడెడ్, మున్సిపల్ పాఠశాలలు, మోడల్ స్కూల్‌లో వసతి సౌకర్యం లేని 8వ తరగతి చదువతున్న విద్యార్థులు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో శామ్యూల్ పాల్ తెలిపారు. పరీక్ష రుసుం జనరల్, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50, చెల్లించాలన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఈ నెల 4 నుంచే స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే చివరితేదీ ఈనెల 30వ తేదీ చివరి గడువు అని తెలిపారు. పరీక్ష రుసుం చెల్లించిన తర్వాత ఆన్‌లైన్ దరఖాస్తు, చలానాలు, ఆదాయం, కుల, 8వ తరగతి స్టడీ మా ర్కుల జాబితా, ఆధార్, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్ కాపీలను జతపరిచి డీఈవో కార్యాలయంలో అక్టోబరు 1వ తేదీ లోపు సమర్పించాలన్నారు. డిసెంబరు 7న పరీక్ష ఉంటుందని చెప్పారు.

తగ్గేదేలే..!

● రెచ్చిపోతున్న ఆక్రమణదారులు
● ప్రభుత్వ క్వార్టర్స్‌ను ఖాళీ చేయం
● ఉద్యోగిపై మహిళా నేత, అనుచరుల దాడి?
● పోలీస్‌స్టేషన్‌కు చేరిన పంచాయితీ
● ఫిర్యాదు చేసిన ఉద్యోగి
● కూటమి నేతలను ఆశ్రయిస్తున్న ఆక్రమణ దారులు



ఆర్అండ్‌బీ ఎస్ఈ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కుల సంఘాలు

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ క్వార్టర్స్‌లో తిష్టవేసిన ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. ఖాళీ చేసే ప్రసక్తే లేదంటున్నారు. కొందరు ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధుల ఫిర్యాదులతో జిల్లా యంత్రాంగం సీరియస్‌గా తీసుకుంది. నగరంలో ప్రధాన కాలనీగా ఉండటం.. అందులో అసాంఘిక కార్యకలాపాలు, అక్రమాలకు కేరాఫ్‌గా నిలిచాయనే విమర్శలున్నాయి. కోట్ల విలువ చేసే ఇళ్లు, స్థలాలను కబ్జాదారుల్లో వైసీపీకి చెందిన పలువురు నాయకులు, అనుచరులు, బంధువులు, కుల సంఘాల నాయకులు శాసిస్తున్నారనే ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఆక్రమణదారుల బెదిరింపులతో కొందరు జిల్లా అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆపార్టీలోకి కొందరు చేరి మళ్లీ ప్రభుత్వ క్వార్టర్స్‌పై పెత్తనం యథావిధిగా చెలాయిస్తుండటంతో ఖాళీ చేయించే ప్రక్రియ ఒక అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కి అన్నచందంగా మూడు నెలలుగా సాగుతోందనే విమర్శలున్నాయి.

రెవెన్యూ విభాగంలో ఉద్యోగులు..

విద్యుత్, రెవెన్యూ, ఆర్అండ్‌బీ, నగరపాలక సంస్థ, పోలీసుల ఆధ్వర్యంలో సాఫీగా సాగాల్సిన ప్రక్రియను కొందరు కష్టతరం చేస్తున్నారు. రెవెన్యూ విభాగంలోని కొందరు ఉద్యోగులు ఆక్రమణ దారులకు సలహాలు, సూచనలు ఇవ్వడంతో ఏరివేత ప్రక్రియకు తూట్లు పొడుస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూలో క్వార్టర్స్ కేటాయించే విభాగంలోని కొందరు ఉద్యోగులు ఈ చర్యలకు పాల్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. పదవీ విరమణ చేసిన ఓ ఉద్యోగి కనుసన్నల్లో 20 గృహాలు ఆక్రమణలో ఉండటం కొసమెరుపు.

కలెక్టర్ సీరియస్‌గా తీసుకున్నా..

ప్రభుత్వ క్వార్టర్స్‌ను ఖాళీ చేయించాలని కలెక్టర్ రంజిత్‌బాషా సీరియస్‌గా తీసుకున్నారు. అయినప్పటికీ లెక్క చేయడం లేదన్న ప్రచారం ఉంది. ఈనెల 7వ తేదీ లోపు ఖాళీ చేయాలని మూడు నెలల ముందే నోటీసులు జారీ చేశారు. గడువు ముగిశాక ఖాళీ చేయాలంటూ మూడు బృందాలుగా ఏర్పడి అక్రమార్కుల ఇళ్లకు నీరు, విద్యుత్ కట్‌చేసే ప్రక్రియను వేగవంతం చేశారు. ఓ మహిళా నేత తన అనుచరులతో ఆర్అండ్‌బీ ఉద్యోగిపై దాడులకు తెగబడ్డారు. ఆ ఉద్యోగి మహిళా నేత, అనుచరవర్గంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడవ పట్టణ పోలీసులు జమీలా, సునీత మరి కొందరిపై కేసు నమోదు చేశారు. అయినా కూడా తాము ఖాళీ చేసే ప్రసక్తే లేదంటూ ఎదురు దాడులకు పూనుకుంటున్నారు. పోలీసులు కూడా ప్రేక్షక పాత్రకు పరిమితమయ్యారనే విమర్శలున్నాయి.

నాడు వైసీపీ.. నేడు కూటమి నాయకులతో..

వైసీపీ హయాంలో పెత్తనం చెలాయించినా చోటా నాయకులే కూటమి నాయకుల అండదండలతో జిల్లా యంత్రాంగంపై ఒత్తిడి పెంచుతూనే ఆందోళనలు, నిరసనలకు సిద్ధమయ్యారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే అనుచరులుగా ముద్రవేసుకున్న ఓనేత 60 ఇళ్లలో పాగా వేశారని కొందరు ఉద్యోగులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఆ మహిళా నేత కొందరు అనుచరులతో బెదిరింపులకు పాల్పడుతున్నారని ఉద్యోగులు వాపోతున్నారు.

నోటీసులు ఇచ్చినా..

నోటీసులు ఇచ్చినప్పటికీ తమపై దాడులకు తెగబడటమేమిటని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. మంగళవారం అర్అండ్‌బీ ఎస్ఈ కార్యాలయం ఎదుట కుల సంఘాలతో ఆందోళనలు చేయించారని కొందరు ప్రభుత్వ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. కోట్ల విలువైన ప్రభుత్వ క్వార్టర్స్‌లో ఉద్యోగులు ఉండాల్సిన ప్రదేశాల్లో వీరి పెత్తనమేమిటని మండిపడుతున్నారు. కుల సంఘాలు, పలు సొసైటీల పేరుతో ఉన్న ఆక్రమణదారులు ఉన్న ఫలంగా తాము ఎక్కడికి వెళ్లాలని పైగా ప్రశ్నించడమేమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బనవాసిలో చోరీ

3 తులాల బంగారం, రూ.60 వేలు, వెండి ఆభరణాలు అపహరణ

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బనవాసి గ్రామంలో ఈనెల 7న చోరీ జరిగింది. ఎమ్మిగనూరు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలివీ.. ఈనెల 7న బనవాసి గ్రామానికి చెందిన మాల విజయ్‌కుమార్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. కుటుంబ సభ్యులు తమ పనినిమిత్తం బయటకు వెళ్లగా ఇంట్లో చొరబడి 3 తులాల బంగారంతో పాటు రూ.60 వేల నగదు, వెండి ఆభరణాలను అపహరించుకెళ్లారు. ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు ఇళ్లు తెరిచి ఉండడం, ఇంట్లో వస్తువులు చిల్లరవందరగా పడి ఉండడాన్ని గమనించి చోరీ జరిగిందని గుర్తించారు. ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకొని చోరీ వివరాలను అడిగి తెలుసుకొని విచారణ చేపట్టారు.

వేరుశనగ ధర గరిష్ఠం రూ. 7,490

● ఎమ్మిగనూరు మార్కెట్‌కు భారీగా వేరుశనగ ఉత్పత్తులు



ఎమ్మిగనూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం వేరుశనగ ధర క్వింటా గరిష్ఠం రూ. 7,490 పలికింది. మార్కెట్‌కు ఎమ్మిగనూరు చుట్టుముట్టు ప్రాంతాల నుంచే కాకుండా పత్తికొండ, డోన్, కోడుమూరు, తెలంగాణ, కర్ణాటక నుంచి భారీగా వేరుశనగను రైతులు అమ్మకానికి తీసుకొచ్చారు. 11,462 బస్తాల వేరుశనగ, 738 బస్తాలు ఆముదాలు విక్రయానికి వచ్చాయి. దీంతో మార్కెట్ పంట ఉత్పత్తులతో కళకళలాడింది. వేరుశనగ క్వింటం కనిష్ఠ ధర రూ. 2368, మధ్యస్థ ధర రూ. 5470 పలికింది. అలాగే ఆముదాలు ధర క్వింటా గరిష్ఠం రూ. 6139, మధ్యస్థం రూ. 6039, కనిష్ఠం రూ. 5590, పలికింది. గత వారంలో కన్నా ఈ వారంలో వేరుశనగ ధర రూ. ఏడు వేలు దాటి పలకటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జేఎన్ శేషయ్య మృతి తీరని లోటు

● టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య
● పలువురు కవులు, కళాకారుల నివాళి



జేఎన్ శేషయ్య మృతదేహానికి నివాళి అర్పిస్తున్న పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సాహితీ, సాంస్కృతిక రంగాల్లో జేఎన్ శేషయ్య బలమైన ముద్ర వేశారని, ఆయన మృతి తీరని లోటని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అన్నారు. కర్నూలుకు చెందిన ప్రజా సంఘాల నాయకుడు, సుందరయ్య స్ఫూర్తికేంద్రం కన్వీనర్ జేఎన్ శేషయ్య (68) సోమవారం రాత్రి గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. మంగళవారం కృష్ణనగర్ ఐటీసీ సమీపంలోని సాయినగర్‌లోని గృహం వద్ద జేఎన్ శేషయ్య మృతదేహాన్ని పత్తి ఓబులయ్యతోపాటు పలువురు కవులు, కళాకారులు సందర్శించి నివాళులర్పించారు. ఆయనతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కెంగార మోహన్, జంధ్యాల రఘుబాబు మాట్లాడుతూ కర్నూలులో బాలోత్సవాల నిర్వహణలో అత్యంత కీలకంగా పనిచేసిన ఘనత జేఎన్ శేషయ్యకు దక్కుతుందని శ్లాఘించారు. స్రవంతి నగర అధ్యక్ష కార్యదర్శులు ఆవుల బసప్ప, ఆవుల చక్రపాణి యాదవ్ మాట్లాడుతూ సామాజిక సంక్షేమ కార్యక్రమాలు, చైతన్యవంతమైన కార్యక్రమాల్లో జేఎన్ శేషయ్య ఎంతో ముందుండి నడిపించేవారని అన్నారు. ఆయన ఆకస్మిక మరణం ప్రజా సంఘాలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి నాటకపోటీల్లో

సత్తా చాటిన 'జగదేక సుందరి సామా'

● ఉత్తమ ప్రదర్శనతో పాటు నాలుగు అవార్డులు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలోని సత్యసాయి సేవా సమితి, ఏపీ రెవెన్యూ సర్వీసెస్, అమరావతి జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 5 నుంచి 8 వరకు నిర్వహించిన జాతీయస్థాయి నాటక పోటీల్లో కర్నూలు టీజీవీ కళాక్షేత్రం కళాకారులు ప్రదర్శించిన 'జగదేక సుందరి సామా' చారిత్రక పద్య నాటకం ప్రథమ బహుమతి అందుకుంది. అలాగే ఈ నాటకంలో వివిధ పాత్రల్లో నటించిన నలుగురు కళాకారులకు వ్యక్తిగత అవార్డులు కైవ సం చేసుకున్నారు. మంగళవారం అనంతపురంలోని శ్రీకృష్ణ కళామందిరంలో ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవ సభలో టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ప్రథమ బహుమతిని అందుకున్నారు. అలాగే ఉత్తమ దర్శకుడిగానూ ఈ నాటకానికి ఆయనకు అవార్డు లభించింది. పత్తి ఓబులయ్యకు ప్ర శంసాపత్రం, జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ నాటకంలో ఉత్తమ పాత్రగా కె. బాలవెంకటేశ్వర్లు, ఉత్తమ నటిగా సురభి ప్రభావతి, ఉత్తమ నటుడిగా జి.శ్రీనివాసరెడ్డిలు ఎంపిక య్యారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా రెవెన్యూ అధికారి మలోల, సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు మైఖేల్ బాబు, సీనియర్ రంగస్థల నటుడు బాలాజీ నాయుడు, సుబ్రహ్మణ్యంలు పాల్గొన్నారు. కర్నూలు టీజీవీ కళాక్షేత్రం కళాకారులు మహ్మద్ మియా, సంగా ఆంజనేయులు పాల్గొన్నారు. పత్తి ఓబులయ్య మాట్లాడుతూ



'జగదేక సుందరి సామా' నాటకానికి జాతీయ బహుమతి అందుకుంటున్న కళారత్న పత్తి ఓబులయ్య

జగదేక సుందరి సామా నాటకం చింతామణి నాటకాన్ని మైమరపించేలా నిలుస్తుందన్నారు. దివంగత నంది అవార్డు గ్రహీత పల్లేటి లక్ష్మీ కులశేఖర్ రాసిన ఈ నాటకానికి జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి రావడం సంతోషంగా ఉందని తెలిపారు. టీజీవీ కళాక్షేత్రం కళాకారుల నాటకం జగదేక సుందరి సామా జాతీయస్థాయిలో ప్రథమ బహుమతి, నాలుగు వ్యక్తిగత అవార్డులు దక్కించుకోవడం పట్ల జిల్లాకు చెందిన పలు సాహిత్య, కళాసంస్థల ప్రతినిధులు, కళాకారులు, కవులు, రచయితలు హర్షం వ్యక్తం చేశారు.

భార్యను చంపిన భర్త



శిరీష (ఫైల్)

నంద్యాల టౌన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రతి రోజూ ఇంట్లో గొడవలు, ఇంటి వద్దకు అప్పులు వారు రావడం, అనుమానంతో భార్యను భర్త దారుణంగా కత్తితో పొడిచి చంపిన సంఘటన నంద్యాలలో మంగళవారం చోటు చేసుకుంది. టూ టౌన్ సీఐ అస్రర్ బాషా వివరాల మేరకు.. నంద్యాల పట్టణం ఎన్జీవో కాలనీకి చెందిన శిరీష (45), సోమనాథశర్మ భార్యాభర్తలు. భర్త సోమనాథశర్మ ఆత్మకూరులోని ఓ దుకాణంలో అకౌంటెంటుగా పని చేస్తున్నారు. అయితే భార్యకు అప్పులు ఇచ్చిన వారు రోజూ ఇంటి వద్దకు వచ్చి గొడవ చేసేవారు. అలాగే ఆమె ప్రవర్తనపై కూడా అనుమానం కలిగిన భర్త హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. వీరికి కుమారుడు, కుమార్తె సంతానం కాగా కుమారుడు కొంతకాలం క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కూతురు శ్రీహిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీ.. బాలుడి మృతి



మహిధర్ (ఫైల్)

అవుకు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకేసుల గ్రామానికి చెందిన ఎర్రబెల్లి మహిధర్ (3) ప్రైవేటు స్కూల్ బస్సు ఢీకొని మంగళవారం మృతి చెందాడు. వివరాలివీ.. సుంకేసుల గ్రామానికి చెందిన ఎర్రబెల్లి శ్రీనివాసులు, వెంకట మీనాక్షి దంపతులకు ఇద్దరు కూతుర్లు, కుమారుడు సంతానం. రెండో కూతురు వెంకట రక్షిత కోవెలకుంట్లలో ఓ ప్రైవేట్ స్కూల్‌లో 4వ తరగతి చదువుతోంది. స్కూల్ యాజమాన్యం ఏర్పాటు చేసిన బస్సులో రోజూ సుంకేసుల నుంచి కోవెలకుంట్లకు వెళ్ళి వచ్చేది. అలాగే మంగళవారం ఉదయం శ్రీనివాసులు కూతురును స్కూల్ బస్సు ఎక్కించడానికి బస్సు వద్దకు వెళ్లారు. వీరి వెనుకనే బస్సు వద్దకు వచ్చిన బాలుడు మహిధర్ బస్సు ముందు భాగంలోకి వెళ్లాడు. బస్సు ముందు నిలబడిన బాలుడిని డ్రైవర్ గమనించకుండా బస్సును ముందుకు కదిలించాడు. బస్సు ఢీకొనడంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాలుడి మృతదేహాన్ని స్కూల్ బస్సులోనే అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. తండ్రి శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి వెల్లడించారు. అయితే స్కూల్ బస్సులో అటెండర్ లేకపోవడం, డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పలువురు ఆరోపించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ..

పెద్దకడబూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందింది. ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాలివీ.. వగరూరుకు చెందిన ఖాదర్‌బాషా, తన తల్లి హసీనాతో ద్విచక్రవాహనంపై పెద్దకడబూరు మీదుగా వగరూరుకు వెళ్తున్నారు. ఈ సమయంలో చిన్నకడుబూరు గ్రామానికి చెందిన హనుమయ్య వాహనాన్ని ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడ్డ హసీనాను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. హనుమయ్యకు రక్త గాయాల య్యాయి. హనుమయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

డోన్ రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వ్యక్తిని పోలీసులు కాపాడారు. ఈ ఘటన డోన్ పట్టణంలో మంగళవారం జరిగింది. డోన్ పట్టణంలోని వైఎస్ నగర్‌కు చెందిన దంపతులు రవితేజ, జయంతి మధ్య మనస్పర్థలు తలెత్తాయి. తన భర్త తన సెల్‌ఫోన్‌ను దొంగలించాడని జయంతి డోన్ పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి ఇంటి నుంచి వెళ్లిపోయారు. సీఐ ఇంతియాజ్ బాషా పర్యవేక్షణలో పోలీసులు హుటాహుటిన వెళ్లి పరిశీలించగా.. భర్త ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని అపస్మారక స్థితిలో కొట్టుమిట్టాడుతుండగా.. పోలీసులు కిందకు దింపి ఆటోలో డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం రవితేజ కోలుకుంటున్నాడు.

యువతి అదృశ్యం

బండిఆత్మకూరు సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకనూరు గ్రామానికి చెందిన 18 సంవత్సరాల యువతి మంగళవారం అదృశ్యమైనట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. ఉదయం ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని ఆ యువతి తండ్రి ఫిర్యాదు చేశారన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పేర్కొన్నారు.

చదువుకోవాలని చెప్పినందుకు...

- ఉపాధ్యాయుడిపై దాడికి యత్నించిన విద్యార్థి

హొళగుంద, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చదువుకోవాలని మందలించడంతో ఉపాధ్యాయుడిపైనే ఓ విద్యార్థి సోమవారం దాడికి యత్నించాడు. వివరాల మేరకు.. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఓ పదో తరగతి విద్యార్థి ఇష్టానుసారంగా వ్యవహరిస్తుంటంతో ఉపాధ్యాయుడు మందలించాడు. సదరు విద్యార్థి తరగతి గదిలోనే ఉపాధ్యాయుడి కాలర్ పట్టుకొని దాడికి యత్నించాడు. మిగతా ఉపాధ్యాయులు విద్యార్థిని బయటకు పంపివేశారు. కాగా సదరు విద్యార్థి ఉపాధ్యాయుడిపై దాడి చేసిన మొదటి విద్యార్థి నేనే నంటూ మొబైల్ ఫోన్‌లో స్టేటస్ పెట్టుకోవడంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విద్యాబుద్ధులు నేర్పే టీచర్లపై ఇలా వ్యవహరించడం తగదని విద్యావేత్తలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై హెచ్‌ఎం కబీర్ సాబ్‌ను వివరణ కోరగా విద్యార్థి, ఉపాధ్యాయుడి కాలర్ పట్టుకున్న విషయం వాస్తవమేనని, సదరు విద్యార్థి తండ్రిని పిలిపించి, కౌన్సెలింగ్ ఇచ్చి, టీసీ ఇవ్వనున్నట్లు తెలిపారు.

ష్యూరిటీ పేరుతో మోసం చేశారు

- పోలీసులకు మహిళ ఫిర్యాదు

కోవెలకుంట్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ష్యూరిటీ పెట్టేందుకు రావాలని పిలిపించి, మద్యం తాపించి బ్యాంకులో ఏకంగా తన భర్త పేరుపై రూ.6.95 లక్షలు లోను తీసుకున్నారని ఓ మహిళ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ రుణం మొత్తంలో రూ.3.85 లక్షలు బ్యాంకులో రుణం చెల్లించి మిగతా రూ.3.10 లక్షలు తన అకౌంటుకు మళ్లించుకున్నారని ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మల్లికార్జున తెలిపిన వివరాలివీ.. కోవెలకుంట్ల మండలంలోని గుల్లదుర్తి గ్రామానికి చెందిన మనోహ రమ్మకు నంద్యాల పట్టణానికి చెందిన తేజతో వివాహమైంది. వీరు నంద్యాలలో నివాసం ఉంటున్నారు. తేజ మున్సిపాలిటీలో ఉద్యోగం చేస్తున్నారు. నంద్యాల పట్టణంలోని ఎస్‌బీఐలో తేజ పేరు మీద రూ.6 లక్షలు పర్సనల్ లోన్ తీసుకున్నారు. ప్రతినెలా జీతం నుంచి డబ్బులు కట్ అయ్యేవి. సుమారు 3 లక్షలు అప్పు తీరింది. మరో 3 లక్షలు మిగిలింది. ఇటీవలనే తేజ సమీప బంధువులైన రాజేశ్, అతని స్నేహితుడు అబ్దుల్లా కలిసి పట్టణంలోని వేరొక బ్యాంకులో తేజ పేరు మీద రూ.6.95 లక్షలు తీయించి తేజకు ఎస్‌బీఐలో ఉన్న అప్పును క్లోజ్ చేయించారు. మిగతా డబ్బును వారు స్వాహా చేశారు. ఈ నెల డబ్బులు కట్ కాకపోవడంతో తేజ భార్య మనోహరమ్మ బ్యాంకు వెళ్లి విచారి. లోన్ మొత్తం క్లోజ్ అయిందని చెప్పడంతో అసలు విషయం బయటపడింది. ఈ విషయంపై భర్త తేజను అడిగారు. బ్యాంకులో షూరిటీ పెట్టాలని రాజేశ్, అబ్దుల్లా పిలిపించారని, లోన్ తీసుకున్నట్లు తెలియదని తేజ మనోహ రమ్మకు చెప్పారు. దీంతో మనోహరమ్మ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పని మనిషే ప్రాణం తీసింది..

- శివలీల హత్య కేసులో నిందితురాలి అరెస్టు
- ఎస్పీ విక్రాంత్ పాటిల్



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఎస్పీ బాబు ప్రసాద్

కర్నూలు క్రైం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మూడో పోలీస్‌స్టేషన్ పరిధిలో సాయి వైభవ్ నగర్‌లో ఈనెల 1వ తేదీన జరిగిన కాటసాని శివలీల హత్య కేసును పోలీసులు ఛేదించారు. మంగళవారం మధ్యాహ్నం ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఎస్పీబాబు ప్రసాద్, సీఐ లు శేషయ్య, చంద్రబాబునాయుడు విలేకరుల సమావేశం నిర్వహించారు. కేసు వివరా లను వెల్లడించారు. ఈహత్యకు కారణమైన ఆ ఇంట్లో పని చేసే కురువ వరలక్ష్మిని అరెస్టు చేశారు. వరలక్ష్మి కొద్ది కాలంగా శివలీల ఇంట్లో పని చేస్తుంది. శివలీల ఇంట్లో ఒంటరిగా ఉంటుందని భావించి తనకు డబ్బు అవసరం కాగా ఆమెను చంపి నగలు కాజేయాలని చూసింది. కొద్దికాలంగా ప్రణాళిక రూపొందించుకుంది. ఇటీవల ఆమెను పని నుంచి తొలగించేశారు. అయితే ఈ నెల 1వ తేదీన మరోసారి కాటసాని శివలీల ఇంటికి వచ్చి పనికి మరలా వస్తానని కోరింది. శివలీల వెనక్కు తిరిగి మాట్లాడుతుండగా.. ముందుగానే సిద్ధంగా ఉంచుకున్న రోకలి బండతో శివలీల తలపై కొట్టింది. దీంతో ఆమె కింద పడి పోగానే... మరో ఐదారుసార్లు బలంగా కొట్టింది. ఆమె కొనఊపిరితో ఉండగా.. ఆమె మెడ లోని బంగారు చైన్, నాలుగు గాజులు, బెడ్ రూంలో ఉన్న మరి కొంత నగదు తీసుకుని పరారైంది. దీంతో ఆరు చెక్‌బుక్కులు, ఏడు పాస్‌బుక్కులు కూడా తాను వెంట తీసుకెళ్లింది.

డీఎస్పీ ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి..

పట్టపగలే శివలీల హత్య నగరంలో కలకలం సృష్టించింది. పోలీసులు ఈకేసును సీరి యస్‌గా తీసుకున్నారు. డీఎస్పీ బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో సీఐలు పలువురు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. మొదటగా దారిదోపిడీ దొంగలు అయింటారని భావించారు. ఆ సమీపంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. ఎక్కడా అనుమానాస్పద వ్యక్తులు తారస పడలేదు. మరో వైపు హత్య జరిగిన తర్వాత కూడా ఆ ఇంట్లో నుంచి ఎవరూ బయటకు వచ్చిన దాఖలాలు కూడా కనిపించలేదు. సుమారు రాత్రి పొద్దుపోయే దాకా ఐదారు మంది సీఐలు, 25 మందికి పైగా కానిస్టేబుళ్లు ఈ కేసును పలు కోణాల్లో దర్యాప్తు చేశారు. అదే రోజు రాత్రి ఓ సీసీ కెమెరాను పరిశీలిస్తే ఓ మహిళ ముఖానికి ముసుగు ధరించి అటు వైపు వెళ్తున్నట్లుగా గుర్తించారు. ఈ ఫొటోను మృతురాలి కూతురికి చూపించారు. ఆమె కూడా అనుమానంగా గుర్తించింది. పోలీసులు పనిమనిషి వరలక్ష్మి కోసం గాలించగా.. ఆమె పరారీలో ఉన్నట్లు గుర్తించారు. సాంకేతిక పరిజ్ఞానంతో ఆమెను గుర్తించారు. అదుపులోకి తీసుకుని విచారిస్తే తానే హత్య చేసినట్లుగా నేరాన్ని అంగీకరించింది. ఆ తర్వాత తీసుకున్న సొత్తుతో హత్య చేశాక ఎవరికి అనుమానం రాకుండా వెనుకనుంచి గోడదూకి పరారైంది. దీంతో ఎక్కడా సీసీ కెమెరాల్లో కూడా నిందితురాలి జాడ కనిపించలేదు. చోరీ సొత్తును బంధువుల ఇళ్లలో దాచింది. పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని చోరీ చేసిన సొత్తును మొత్తం స్వాధీనంచేసుకున్నారు. కేసు ఛేదించడంలో ప్రతిభ చూపిన హెడ్ కాని స్టేబుళ్లు శ్రీనివాసులు, జి.ప్రతాప్‌కుమార్, శేఖర్‌బాబు, జే.శేఖర్, చంద్రబాబు నాయుడు, పరమేశ్వరుడు, సమీర్, వీరబాబు, నాగరాజు, రాముడు, ఇబ్రహీంను ఎస్పీ అభినందించారు.



ఆభరణాలను పరిశీలిస్తున్న ఎస్పీ

ఆ రోజు ఆమె ఎక్కడెక్కడికి వెళ్లింది

హత్య చేసిన రోజు నిందితురాలు తమ సొంతూరైన గోపాలనగరం వెళ్లి ఉదయం వితంతు పింఛన్ తీసుకుంది. డోన్ నుంచి కర్నూలుకు వచ్చింది. కర్నూలులో గుత్తి పెట్రోల్ బంకు వద్ద బస్సు దిగింది. అక్కడి నుంచి ఆటోలో రైతుబజారు వరకు వచ్చి అక్కడి నుంచి ముఖానికి మాస్కు ధరించి నేరుగా శివలీల ఇంటికి వెళ్లినట్లుగా గుర్తించారు.

ఆలయాలే టార్గెట్‌గా..

- హల్‌చల్ చేసిన దొంగలు
- తాళాలు పగలగొట్టారు
- హుండీలు ఎత్తుకెళ్లారు
- పోలీసుల ముమ్మర గాలింపు



మూలపెద్దమ్మ ఆలయంలో చోరీని పరిశీలిస్తున్న పోలీసులు

గడివేముల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆలయాలే టార్గెట్‌గా దొంగలు రెచ్చిపోయారు. మండలంలో మంగళవారం వేకువజామున దొంగలు హల్‌చల్ చేశారు. రోడ్డుపక్కన ఉన్న ఆలయాలను టార్గెట్ చేసి భక్తులు సమర్పించిన ముడుపులను అపహరించినట్లు స్థానికులు, పోలీసులు తెలిపారు. వివరాలు.. వేకువజామున కొందరు దుండగలు బొలెరో వాహనంలో వచ్చి బూజనూరులో రోడ్డు పక్కన ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో చోరీకి పాల్పడ్డారు. ఆలయ గేటుకు ఉన్న తాళాన్ని పగలగొట్టారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న హుండీని ఎత్తుకెళ్లారు. నందికొట్కూరు రహదారిలో వెళ్తూ గడివేములలో రోడ్డుపక్కన ఉన్న నూతన మూలపెద్దమ్మ ఆలయంలో ఇదే తరహా దోపిడీకి పాల్పడ్డారు. ఆలయంలో హుండీని ఎత్తకెళ్లడానికి ప్రయత్నించారు. హుండీ బరువుగా ఉండటంతో ఆలయంలో నుంచి బయటకు ఇడ్చూకుంటూ వెళ్లారు. ఈ క్రమంలో ఆలయం ముంగిట భక్తులు సమర్పించిన నాణేలు పడిపోయాయి. మంగళవారం తెల్లవారుజామున అమ్మవారికి పూజలు చేసేందుకు ఆలయ అర్చకుడు వచ్చారు. ఆలయం ముంగిట నాణేలు పడిఉండటాన్ని గమనించారు. ఆలయంలోకి ప్రవేశించగా హుండీని ఈడ్చుకెళ్లిన ఆనవాళ్లు కనిపించడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. వారు ఘటనాస్థలికి చేరుకొని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. క్లూస్‌టీమ్‌ను పిలిపించి ఆనవాళ్లను సేకరించారు. సీసీ కెమెరాలను పరిశీలించి దుండగలు వినియోగించిన వాహనాలను, వారు వెళ్లిన దారిని గుర్తించారు. ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి బూజనూరు గ్రామ శివారులో పడవేసిన వేంకటేశ్వరస్వామి ఖాళీ హుండీని, గడివేముల గ్రామ శివారులో మూలపెద్దమ్మ ఆలయ హుండీని గుర్తించారు. మూలపెద్దమ్మ ఆలయ హుండీలో భక్తులు సమర్పించిన నాణేలు, అమ్మవారికి సమర్పించిన వెండి ఆభరణాలు దొంగలు వదిలి వెళ్లినట్లు గుర్తించారు. మూలపెద్దమ్మ పూజారి చిన్నమాచర్ల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మూలపెద్దమ్మ ఆలయంలో సుమారు రూ.1.50 లక్షలు, బూజనూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో రూ.30 వేలను దుండగలు అపహరించారని భక్తులు చర్చించుకుం టున్నారు.

రెండు హుండీలు పగలగొట్టి..

మంత్రాలయం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వగరూరు గ్రామంలో వెలసిన భీర లింగేశ్వరస్వామి, వీర నాగప్ప దేవాలయాల్లో రెండు హుండీలు గుర్తు తెలియని వ్యక్తులు పగలకొట్టి నగదు, వెండి, మైక్ సెట్, ఇతర సామగ్రిని దోచుకెళ్లారు. ఈ చోరీ సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత మంగళవారం తెల్లవారుజామున జరిగి ఉండవచ్చని గ్రామస్థులు తెలుపుతున్నారు. గ్రామస్థులు, మంత్రాలయం పోలీసులు తెలిపిన వివరాలివీ.. భీర లింగేశ్వరస్వామి ఆలయంలో 50 కేజీల బరువున్న హుండీని ఎత్తుకెళ్లారు. దాదాపు హుండీలో రూ.50వేల నుంచి రూ.90వేల వరకు ఉండవచ్చని, ఈ హుండీని ప్రతి ఏడాది విజయదశమికి లెక్కిస్తామని భక్తులు చెబుతున్నారు. వీర నాగప్ప స్వామి ఆలయంలో హుండీని పగలకొట్టి అందులోని నగదును ఎత్తుకెళ్లారు. ప్రతి ఏడాది ఈ హుండీని లెక్కింపు మహాశివరాత్రి రోజున లెక్కింపు చేపడుతారని, ఇందులో రూ.80 వేల నుంచి రూ.90 వేల వరకు నగదు వస్తుందని తెలిపారు. మైకు సామగ్రి, మొక్కుబడుల కింద వచ్చిన వెండి, వివిధ ఆభర ణాలు సైతం అపహరించుకుని వెళ్లారు. మంగళవారం ఉదయం ఆలయ పూజారులు వీరనాగుడు, రామాం జనేయులు దేవాలయం తలుపులు పగులకొట్టి ఉండటం చూసి మంత్రాలయం పోలీసులకు సమాచారం ఇచ్చారు. మంత్రాలయం సీఐ రామాంజులు, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కర్నూలు నుంచి వచ్చిన క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు. పూజారులు, సర్పంచ్ లింగారెడ్డి ఫిర్యాదు మేరకు రెండు హుండీల చోరీపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కారుణ్య నియామకాలపై హర్షం



కలెక్టర్ రంజిత్ బాషాను కలిసిన ఎస్టీయూ నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కారుణ్య నియామకాలు చేపట్టడంతో పశ్చిమ ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డితో పాటు ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోకారి, జనార్దన్ మంగళవారం కలెక్టర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా పరిషత్ యాజమాన్యంలో పని చేస్తూ మరణించిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల కుటుంబాలు 86 మంది కారుణ్య నియామకాల కోసం దరఖాస్తు చేసుకోగా.. ఇందులో 36 మందికి జూనియర్ సహాయకులుగా కారుణ్య నియామకాలు చేపట్టడం హర్షణీయమన్నారు. కారుణ్య నియామకాల కోసం దరఖాస్తు చేసుకున్న మరో 50 మంది ఉన్నారనీ, గత ఐదు సంవత్సరాల నుంచి ఉద్యోగం లేక ఆర్థికంగా చిన్నభిన్నం అవుతూ పిల్లల చదువులు, వివాహాలు అర్థాంతరంగా ఆగిపోయే పరిస్థితులు ఉన్నాయన్నారు. అయితే అర్హతలను సడలించి, మేనేజ్మెంట్‌తో సంబంధం లేకుండా కారుణ్య నియామకాలు సత్వరమే చేపట్టాలని కోరారు. జిల్లా పశ్చిమ ప్రాంతమైన ఆదోని, ఆలూరు, పత్తికొండ ప్రాంతాల్లో ప్రజలు వలసలు వెళ్తున్న కారణంగా వారితో పాటు బాలబాలికలు వలసలు వెళ్లకుండా విద్యార్థులు విద్యకు దూరం కాకుండా సీజనల్ హాస్టల్ ఏర్పాటు చేయాలని కోరారు. కేజీబీవీలో, మోడల్ స్కూల్‌లో, సోషల్ వెల్ఫేర్, గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల సీట్లను పెంచాలని కోరారు. అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ తగిన ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారనితెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉపాధ్యాయ వాణి సంపాదకులు గాజుల నాగేశ్వరరావు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి అజాంబేగ్ తదితర ఉపాధ్యాయులు ఉన్నారు.

పెద్ద పరిశ్రమతో పేద రైతు పోరాటం

- పరిశ్రమతో నిర్వీర్యమైన భూమి
- భూమి కొనుగోలు చేయాలని అల్ట్రాటెక్ ఫ్యాక్టరీతో పోరాటం
- కొనలేమంటున్న సిమెంట్ పరిశ్రమ



పాసుపుస్తకాలు చూపుతున్న తల్లి పేరం నాగమ్మ, రామచంద్రుడు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సిమెంటు పరిశ్రమ రంగంలో అగ్రగామిగా కొనసాగుతున్న అల్ట్రాటెక్ పరిశ్రమతో ఓ పేద రైతు ఆరేళ్లుగా పోరాటం చేస్తున్నారు. పరిశ్రమ రాకతో బాధిత రైతు భూమిలో పంటలు పండించుకోవడం, ఇంటి నిర్మాణము కూడా కష్టమే. దీంతో తన తల్లి పేరం నాగమ్మ పేరుపై ఉన్న 36 సెంట్లు భూమి కొనుగోలు చేయాలంటూ పోరాటం చేస్తున్నాడు కొలిమిగుండ్ల మండలం గొర్విమానుపల్లె గ్రామానికి చెందిన రైతు పేరం రామచంద్రుడు. కొలిమిగుండ్ల మండలం తుమ్మలపెంట గ్రామ సమీపంలో అనంతపురం జిల్లా సరిహద్దులో అల్ట్రాటెక్ పరిశ్రమ నెలకొని ఉంది. పరిశ్రమ కొంత భాగం నిర్మాణం అనంతపురం జిల్లాలో ఉన్నప్పటికీ, కొలిమిగుండ్ల మండలంలోని తుమ్మలపెంట, గొర్విమానుపల్లె, అంకిరెడ్డిపల్లె, బందార్లపల్లె, పెట్నీకోట తదితర గ్రామాల మైనింగ్ భూములే ఆధారంగా పరిశ్రమ నడుస్తోంది. అల్ట్రాటెక్ దత్తత గ్రామమైన గొర్విమానుపల్లె గ్రామంలో పరిశ్రమ అవసరాల నిమిత్తం నిరంతరం భూముల కొనుగోలు ప్రక్రియ కొనసాగిస్తోంది. ఆయా గ్రామాల్లోని 80శాతం భూములను ఇప్పటికే పరిశ్రమ కొనుగోలు చేసింది. అయితే గొర్విమానుపల్లె గ్రామానికి చెందిన పేరం రామచంద్రుడు కుటుంబానికి సర్వేనంబరు 892-5లో 36సెంట్లు భూమి ఉంది. ఈ భూమిని కొనుగోలు చేయాలంటూ అల్ట్రాటెక్ పరిశ్రమ అధికారుల వద్దకు కాళ్లరిగేలా తిరిగినా పట్టించుకోవడంలేదని రైతు పేరం రామచంద్రుడు వాపోతున్నారు. ఆ భూమి తమ మైనింగ్ లీజులో లేదని, అందుకే కొనలేమంటూ సదరు రైతుతో పాటు, తహసీల్దార్ కార్యాలయానికి సైతం అల్ట్రాటెక్ పరిశ్రమ లిఖిత పూర్వకంగా తెలియజేసింది. అయితే ఇదే సర్వే నెంబరుతో పాటు, దీని చుట్టూ ఉన్న 892, 893, 1088 తదితర అనేక సర్వే నెంబర్లలో పరిశ్రమ వారు భూములు కొనుగోలు చేశారు. దీనిని గమనిస్తే రైతుపై కక్ష సాధింపునకే ఇలా పరిశ్రమ వ్యవహరిస్తోందా? అన్న అనుమానాలు కలుగుతున్నాయి. మైనింగ్ లీజును సాకుగా చూపి పేద రైతులపై తమ నిరంకుశత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. వాస్తవానికి మైనింగ్ లీజు అన్నది భూమి కొనుగోలు చేసిన తర్వాతే పరిశ్రమ వారికి లీజు పొందే హక్కు వస్తుందని మైనింగ్ అధికారులు వెల్లడిస్తున్నారు. గతంలో సైతం ఇదే కుటుంబానికి చెందిన 1088 సర్వే నెంబరులో 4.87ఎకరాల భూమి తమ లీజులో లేదని, కొనుగోలు చేయలేమని అల్ట్రాటెక్ అధికారులు చెప్పారు. దీంతో పేరం రామచంద్రుడు కుటుంబం ఆ భూమిని ఇతరులకు తక్కువ ధరకు విక్రయించారు. అయితే ఏడాదిన్నర వ్యవధిలోనే సదరు వ్యక్తి నుంచి అల్ట్రాటెక్ పరిశ్రమ అధిక ధర చెల్లించి ఆ భూమిని కొనుగోలు చేసింది. ఇలా అల్ట్రాటెక్ పరిశ్రమలో భూముల కొనుగోలు విభాగంలో పనిచేసే కొందరు అధికారులు పేద రైతులపై కక్ష సాధింపు చేస్తున్నారని రైతు రామచంద్రుడు వాపోతున్నాడు. చుట్టూ పరిశ్రమ భూములు, సమీపంలోనే మైనింగ్ పనులు జరుగుతుండటంతో భూమి సాగుకు కూడా అవకాశంలేకుండా పోయింది. తన 36సెంట్లు భూమి నిరుపయోగంగా మారిందని రైతు రామచంద్రుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తాను మొదటి నుంచి తెలుగుదేశం పార్టీ అభిమానినని, తమ కుటుంబానికంతా టీడీపీ సభ్యత్వం ఉందన్నారు. తన కుటుంబం కష్టాల్లో ఉందని, ప్రభుత్వం న్యాయం చేయాలని రామచంద్రుడు కోరుతున్నారు.

పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలి

- వీసీలో పంచాయతీరాజ్ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న జడ్పీ సీఈవో, డీపీవో

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం విజయవాడ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జడ్పీలోని మినీ సమావేశ హాలులో జరిగిన ఈసమావేశంలో సీఈవో నాసరరెడ్డి, డీపీవో భాస్కర్, డివిజనల్, మండల పంచాయతీ అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పంచాయతీల పారిశుధ్య నిర్వహణకు సంబంధించి ఐవీఆర్‌ఎస్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్) కాల్ సర్వేలో సెప్టెంబరు నెల పరితీరును కమిషనర్ సమీక్షించారు. పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టిన పనితీరులో జిల్లా స్థాయిలో మెరుగైన స్థితి కనబరిచిన ఐదు గ్రామ పంచాయతీలు ఐఈసీ యాక్టివిటీస్ గురించి కమిషనర్ ప్రశంసించారు. భవిషత్తులో ఇంకా ఉన్నతంగా పనులు చేపట్టాలన్నారు. జిల్లా స్థాయిలో చివరి స్థానంలో ఉన్న 10 గ్రామ పంచాయతీల పనితీరు మెరుగుపరడం కోసం పంచాయతీ కార్యదర్శులు, అధికారులు చేపట్టాల్సిన చర్యలను తెలిపారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం : వైసీపీ



ఆత్మకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైసీపీ శ్రేణులు

ఆత్మకూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని శ్రీశైలం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, నందికొట్కూరు వైసీపీ ఇన్‌చార్జ్ ధారా సుధీర్ పేర్కొన్నారు. మంగళవారం ఆ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహించిన అన్నదాత పోరులో భాగంగా స్థానిక వైసీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా ఆర్టీసీ బస్టాండ్ వద్దకు చేరుకుని అక్కడి నుంచి బైక్ ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు సకాలంలో ఎరువులను అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. టీడీపీ నాయకులు ఎరువులను దారిమళ్లించారన్నారు. ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ కొందరు సొమ్ము చేసుకుంటున్నారని అన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించకపోవడం వల్ల రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ ఊసే లేకుండా పోయిందన్నారు. అనంతరం ఆర్డీవో నాగజ్యోతికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సయ్యద్‌మీర్, రాజమోహన్ రెడ్డి, కుంట శివారెడ్డి, అంజాద్‌అలి, అంబాల ప్రభాకరరెడ్డి, మోమిన్ ముస్తఫా, నాగేశ్వరరెడ్డి, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

కాకరవాడ చిన్నవెంకట స్వామికి టీడీపీ జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాలి

గోస్పాడు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్ష పదవిని కాకరవాడ చిన్న వెంకటస్వామికి ఇవ్వాలని షెడ్యూల్డ్ కుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళ వారం గోస్పాడు తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద సమావేశమయ్యారు. జిల్లాలోని ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ తదితరులు చిన్న వెంకటస్వామికి మద్దతు ఇవ్వాలన్నారు. బనగానపల్లె టీడీపీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు బాలన్న, ఓబులేసు, గోస్పాడు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కృష్ణుడు, రమణ, సుబ్బరాయుడు, మద్దిలేటి, మహేష్, గోపి పాల్గొన్నారు.

నానో ఎరువులు వాడాలి: ఏడీఏ



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఏడీఏ విజయశేఖర్, ఏవో స్వప్నిక

గోస్పాడు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ ఖర్చులను తగ్గించుకోవడానికి నానో ఎరువులు వాడాలని ఏడీఏ విజయశేఖర్, ఏవో స్వప్నిక సూచించారు. మంగళవారం జూలేపల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేలలో ఉన్న భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వినియోగించాలని, మోతాదుకు మించి ఎరువులు వాడ కూడదని, అలా వాడితే భూమి సారవంతం తగ్గిపోతుందన్నారు. నానో యూరియా వాడాలని, దీనివల్ల పైరుకు 80శాతం నత్రజని అందుతుందన్నారు. గ్రాన్యులర్ యూరియాకంటే నానో యూరియా 8నుంచి 10రోజులు పంటపై ప్రభావం చూపుతుందన్నారు. పంట అన్ని భాగాలకు సులభంగా చేరుతుందని, రైతులందరూ నానో యూరియా వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రామకృష్ణ, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ వైష్ణవి, రైతులు పాల్గొన్నారు.

గుండెపోటుతో దేవస్థానం ఉద్యోగి మృతి



మల్లిక్ రాజా (ఫైల్)

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానంలో రెవెన్యూ లీగల్ విభాగంలో పర్యవేక్షకుడిగా విధులు నిర్వహిస్తున్న మల్లిక్‌రాజా మంగళ వారం గుండెపోటుతో మృతి చెందారు. శ్రీశైల దేవ స్థానం వైద్యశాలలో ప్రాథమిక చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలిస్తుండగా ప్రకాశం జిల్లా దోర్నాల దాటిన తర్వాత మృతిచెందినట్లు తెలిసింది. కాగా ఆయన జనవరిలో దేవస్థానం పర్యవేక్షకుడిగా పదోన్నతి పొందారు. మల్లిక్ రాజా ఆకస్మిక మరణంపై శ్రీశైల దేవస్థానం ఈవో శ్రీని వాసరావు, సహచర సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

న్యాయం చేయండి

నందికొట్కూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): 'మా ఇంటి స్థలాన్ని ఆక్రమించుకుని ఇబ్బందిపెడుతున్నారని మారుతీనగర్‌కు చెందిన జయమ్మ అనే మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఇంటి నిర్మాణం ఏర్పరచుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. అయితే నాగరాజు అనే వ్యక్తి స్థలం తనదని, ఖాళీ చేయాలని బెదిరిస్తున్నాడన్నారు. గత సోమవారం తమకు మారుడు వెంకటేశ్వర్లు గుండెపోటుతో మృతిచెందాడన్నారు. నాడు దహన సంస్కారాలు చేసుకోనీయకుండా అడ్డుపడ్డాడన్నారు. ఇప్పుడు దినవారాలు చేసుకోనీయకుండా బెదిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు అధికారులకు తెలిపినట్లు ఆమె పేర్కొన్నారు.

పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ కొండంత అండ

● ఎమ్మెల్యే గిత్తా జయసూర్య



నందికొట్కూరు: చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య



నంద్యాల: చెక్కును అందజేస్తున్న ఎన్ఎండీ ఫయాజ్, గుర్రప్ప

నందికొట్కూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ కొండంత అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. మంగళవారం మిడుతూరు మండలంలోని వివిధ గ్రామాల్లోని 8 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మిడ్తూరు మండలంలోని వీపన గండ్లకు చెందిన జి.వెంకటేశ్వర్‌రెడ్డికి రూ.86,870, మిడ్తూరు గ్రామానికి చెందిన కె.సత్య నారాయణకు రూ.48,333, విద్యపోగు రవికి రూ.36,337, కటకం సత్యనారాయణకు రూ.1,40,000, సున్నంపల్లెకు చెందిన కమతం వెంకటేశ్వరమ్మకు రూ.44,223, తలముడిపి గ్రామానికి చెందిన కె.పెద్ద తిరుపాలుకు రూ. 98,470, రోళ్లపాడుకు చెందిన ఉప్పరి బాల గుర్రప్పకు రూ.30,756, చెరుకుచెర్లకు చెందిన గద్దల మణెమ్మకు రూ.1,24,655 విలువ గల చెక్కులను లబ్ధిదారులకు ఇళ్లకు వెళ్లి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఖాతా రమేష్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాద్‌రెడ్డి, వంగాల శివరామరెడ్డి, కమతం రాజశేఖర్‌రెడ్డి, వడ్డె జయరాముడు, స్వామిరెడ్డి, దేవనూరు నాగేంద్ర, చెరుకుచర్ల సర్వోత్తమ్‌రెడ్డి పాల్గొన్నారు.

నంద్యాల రూరల్ : ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఎంతగానో అండగా నిలుస్తుందని టీడీపీ యువ నాయకులు ఎన్ఎండీ ఫయాజ్, మండ్ల గుర్రప్ప అన్నారు. నంద్యాల మండల పరిధిలోని చాబోలు గ్రామానికి చెందిన తంగెళ్లా మల్లికార్జునరాజు కుటుంబ సభ్యులకు సీఎం సహాయ నిధి కింద మంజూరైన రూ.64, 836 చెక్కును మంగళవారం పార్టీ కార్యాలయంలో వారు అందజేశారు. రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ చొరవతో ఈ చెక్కు మంజూరైనట్లు ఈ సందర్భంగా వారు వివరించారు.

కుందూ నదికి నీటిని తగ్గించాలి

● కలెక్టర్‌కు రాయలసీమ సాగునీటి సమితి నాయకుల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాయలసీమ సాగునీటి సమితి నాయకులు

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కుందూ నదికి నీటిని తగ్గించి జిల్లా రైతులను ఆదుకోవాలని రాయలసీమ సాగునీటి సమితి నాయకులు మంగళవారం కలెక్టర్ రాజకుమారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి విడుదల చేస్తున్న నీటిలో సగానికి పైగా కుందూనదిలోకి విడుదల చేయడంతో కుందూ పరీవాహక పంటపొలాలు జలమయమవుతున్నాయన్నారు. వరద ముంపునకు గురవుతున్న పాములపాడు, కోవెలకుంట్ల, పెద్దముడియం మండల రైతులతో కలిసి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి గోరుకల్లు రిజర్వాయర్ వరకు కృష్ణా జలాలను తీసుకపోయే కాల్వ సామర్థ్యాన్ని 22 వేల క్యూసెక్కులకు పెంచారన్నారు. అయినా వంతెనలు, అక్విడెక్ట్‌ల నిర్మాణాలు పూర్తి కాకపోవడం వల్ల 10వేల క్యూసెక్కులకు మించి నీటిని తరలించలేరన్నారు. ఈ కారణంగా 13 వేల క్యూసెక్కులను తరలిస్తున్నారని తెలిపారు. దీనివల్ల పాములపాడు మండలంలో పొలాలు మునగడం, వేలాది ఎకరాల్లో జోముతో రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. వెలుగోడు రిజర్వాయర్ స్పిల్‌వే గేట్ల ద్వారా నిరంతరం గాలేరు నదిలోకి నీటిని వదలడం వల్ల కుందూపరివాహక ప్రాంత రైతుల నష్టంతో పాటు స్పిల్‌వే గేట్లకు భద్రత లేకుండా పోతోందన్నారు. కృష్ణాజలాలు ఎస్సార్బీసీ ప్రధాన కాల్వకు చేరకుండా కాల్వను శాశ్వతంగా మూసివేసి, నిప్పులవాగుకు మళ్లించిన అంశంపై కూడా ప్రభుత్వానికి నివేదిక పంపాలని కలెక్టర్‌కు విన్నవించారు.

అలరించిన సంప్రదాయ నృత్యం





విశేష పూజలు అందుకుంటున్న కుమారస్వామి .. సంప్రదాయ నృత్య ప్రదర్శన చేస్తున్న దృశ్యం

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోక కల్యాణార్థం ఆలయ ప్రాంగణంలోని నందీశ్వరునికి శనగలతో విశేషార్చనలు, పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు చేశారు. శ్రీశైల క్షేత్రపాలకుడైన బయలు వీరభద్రస్వామి పంచామృతాలతోనూ, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో అభిషేకం నిర్వహించారు. అలాగే నిత్య కళారాధనలో భాగంగా భవానీ విజయ్ వారిచే సంప్రదాయ నృత్యప్రదర్శన అలరించింది.

రేషన్ బియ్యం పట్టివేత

బండిఆత్మకూరు సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏ కోడూరు గ్రామంలో రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. మంగళవారం నంద్యాలకు చెందిన ఇర్ఫాన్ అనే వ్యక్తి గ్రామంలో ఇళ్ల వద్ద రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఆటోలో తరలిస్తుండగా 13 సంచుల బియ్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ రాయుడు

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఆత్మకూరు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రాయుడు పేర్కొన్నారు. మంగళవారం ఆత్మకూరు సీహెచ్‌సీ నందు ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కింద గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార సమతుల్యంపై అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్ రాయుడు మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. అలాగే పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. జననీ సురక్షయోజన పథకం, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ తదితర ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు అనంతరం గర్భిణులకు రక్తహీనత, థైరాయిడ్, బీపీ, షుగర్‌ల గురించి వివరించారు. అనంతరం గర్భస్థలింగ నిర్ధారణ చట్టం గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేణుగోపాల్, సింగిల్ విండో చైర్మన్ షాబుద్దీన్, వైద్యాధికారి షౌకత్, టీబీ సూపర్‌వైజర్ మస్తానయ్య, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి మద్దిలేటి, స్టాఫ్ నర్స్ రెహానా, టర్మినేట్ హంగర్ వెల్ఫేర్ ప్రాజెక్ట్ మేనేజర్ షేక్ హమీద్, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడదాం

● నంద్యాలలో 5కే రన్



మారథాన్ రేస్‌లో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ ఆదేశాల మేరకు ఏపీఎస్ఏసీఎస్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఆర్.వెంకటరమణ, జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ అధికారి డాక్టర్ ఎం.శారదాబాయి 5కే మారథాన్ రేస్‌ను మంగళవారం ఉదయం నంద్యాలలో నిర్వహించారు. ఎయిడ్స్ నిర్మూలన అవగాహన కార్యక్రమంలో భాగంగా యూత్‌ఫెస్ట్-2025 మారథాన్ రేస్‌ను బొమ్మలసత్రం వద్ద ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి జీజీహెచ్ వరకు నిర్వహించారు. 17 సంవత్సరాలనుంచి 25 సంవత్సరాల్లోపు విద్యార్థులు, యువతీయువకులు, ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు. పురుషుల విభాగంలో జి.విజయరాజు (పాణ్యం) ప్రథమ బహుమతి, టి.సురేష్ నాయుడు (నంద్యాల)ద్వితీయ బహుమతులు సాధించారు. మహిళల విభాగంలో అనూష (ఎం.చింత కుంట) ప్రథమ స్థానం, ప్రసన్న (నంద్యాల) ద్వితీయ స్థానం సాధించారు. ట్రాన్స్‌జెండర్ విభాగంలో కె.శ్రీలేఖ (నంద్యాల) ప్రథమ స్థానం, పి.వినీతగౌడ (నంద్యాల) ద్వితీయ స్థానం సాధించారు.ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ వెంకటరమణ మాట్లాడుతూ హెచ్‌ఐవీపై అవగాహన శిబిరాలు అక్టోబర్ 12వరకు నిర్వహిస్తామన్నారు. ఈ వ్యాధి బారిన పడకుండా ఆరోగ్యవంతులుగా ఉండాలని ఆయన సూచించారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ, జిల్లా శాఖ, పోలీస్ శాఖ, 108, ఎన్‌జీవోస్‌ల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ అధికారి డాక్టర్ ఎం.శారదాబాయి తెలిపారు. విజేతలకు రూ.10వేలు, రూ.7 వేల నగదు బహుమతులు అందజేశారు.డాక్టర్లు అంకిరెడ్డి, జీసీహెచ్ఎస్ఓ లలిత, హెచ్‌ఐవీ కంట్రోల్ క్లస్టర్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ హైదర్ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం



డాక్టర్ పరిమళాదేవిని సన్మానిస్తున్న అధ్యాపకులు

నందికొట్కూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వచ్చిన సందర్భంగా డాక్టర్ బి.పరిమళా దేవిని మంగళవారం నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రంగముని మాట్లాడుతూ పరిమళాదేవిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పరిమళా దేవి మాట్లాడుతూ విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడం లో ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

ఆత్మకూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం పట్ల విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ జుబేర్ సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్‌బాబు, ఏఎన్ఎంఎస్ సుబ్బలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించాలి

పాణ్యం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టిసారించాలని మెంటర్లీ సహ వ్యవస్థాపకుడు వికాస్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ ఈ ఆధ్వర్యంలో ఐదు రోజుల వర్క్ షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫుల్ స్టాక్ వెబ్ అండ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెంట్స్ వినియోగంపై విద్యార్థులకు వివరించారు.ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, హెచ్‌వోడీ ఫరూక్, లక్ష్మీచైతన్య విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని దుకాణాలపై చర్యలు తీసుకోవాలి



ఏడీఏ హేమలతకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఆత్మకూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): యూరియాను అధిక ధరలకు విక్రయిస్తూ నిబంధనలను గాలికొదిలేసిన ప్రైవేట్ దుకాణాలపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు రమేష్‌బాబు, ఆత్మకూరు తాలుకా కార్యదర్శి ప్రతాప్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఇన్‌చార్జ్ ఏడీఏ హేమలతకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. యూరియాను రాజకీయ ఒత్తిళ్ల మేరకు దారి మళ్లిస్తున్నారన్నారు. అలాగే ప్రైవేట్ వ్యాపారులు యూరియా కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే రైతులతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మహ్మద్, హుసేన్, లల్లు, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


వ్యాసరచన పోటీలకు స్పందన

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మాతృభూమికి కళార్చన పోటీలలో భాగంగా మంగళవారం నంద్యాలలో 'స్వర్ణాంధ్ర-ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి మీ ఆలోచనలు' అనే అంశంపై తెలుగులో, 'సమాజంలో పెరుగుతున్న అవినీతి, దాని ప్రభావం ఎలా నిరోధించాలి' అనే అంశంపై ఆంగ్లంలో, 'స్ఫూర్తి కలిగించే నచ్చిన గొప్ప దేశనాయకుని జీవిత విశేషాలు' అన్న అంశంపై హిందీలో వ్యాసరచన పోటీలు జూనియర్, సీనియర్స్ విభాగాలలో నిర్వహించారు. ఈ పోటీలలో 500 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. కళారాధన ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవిక్రిష్ణ, కళారాధన సభ్యులు, తదితరులు ఈ పోటీలను పర్యవేక్షించారు.

రైతులు ఆందోళన చెందొద్దు

మహానంది, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకూ యూరియాను రైతు సేవా కేంద్రాల ద్వారా అవసరమైనంత పంపిణీ చేసేలా ఏర్పాటు చేసామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయాధికారి బి. నాగేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం మహానంది మండలం గాజులపల్లి పొలాల్లో పొలంబడి కార్యక్రమాన్ని వ్యవసాయ సిబ్బంది ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హాజరైన ఏవో మాట్లాడుతూ తెగుళ్లబారి నుంచి పంటను ఏవిధంగా కాపాడుకోవాలి, పంట సాగులో ఎలాంటి మెలుకువలు తీసుకోవాలి అన్న విషయమై అవగాహన కల్పించారు. గ్రామంలో ఇంటింటా తిరిగి యూరియా విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని తెలిపారు. ప్రతి రైతుకు యూరియాను అందచేస్తామని భరోసా ఇచ్చారు. మండల వ్యవసాయ విస్తరణాధికారులు శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు, ఉద్యానవన అధికారి పాల్గొన్నారు.

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న ఆర్డీవో నాగజ్యోతి

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): లింగనిర్ధారణ, భ్రూణహత్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి, వైద్యాధికారి కాంతారావు నాయక్ హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎంపీడీవో సమావేశ భవనంలో ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో నాగజ్యోతి మాట్లాడుతూ.. ఆత్మకూరు డివిజన్ పరిధిలో మొత్తం 9 స్కానింగ్ కేంద్రాలు ఉన్నట్లు వివరించారు. వీటిలో అవసరమైన స్కానింగ్‌లు మాత్రమే చేయాలన్నారు. లింగనిర్ధారణ చేసినా, చేయించినా చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి : సీపీఎం

కొత్తపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల రహదారులకు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల నాయకులు నక్కస్వాములు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని లింగాపురం, నందికుంట గ్రామాల మధ్య ఉన్న రోడ్లను ఆయన పరిశీలించారు. అనంతరం స్వాములు మాట్లాడుతూ ఆత్మకూరు నుంచి సంగమేశ్వరం వెళ్లే రహదారి పూర్తిగా అధ్వానంగా ఉందని, దీంతో ప్రయాణికులతో పాటు ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. లింగాపురం ప్రధాన రహదారిలో నిత్యం బురద నీరు ప్రవహిస్తుండటంతో వాహనదారులు ప్రమాదవశాత్తు కింద పడి గాయాలపాలవుతున్నారన్నారు.

రైతులపై కనికరం లేని ప్రభుత్వం
'అన్నదాత పోరు'లో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



నిరసన తెలుపుతున్న వైసీపీ నాయకులు

డోన్ రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులపై కూటమి ప్రభుత్వానికి కనికరం కూడా లేదని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆరోపించారు. మంగళవారం వైసీపీ ఆధ్వర్యంలో అన్నదాత పోరు కార్యక్రమంలో భాగంగా డోన్ ఆర్డీవో కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీవో నరసింహులుకు వినతి పత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రైతుభరోసా కేంద్రాల ద్వారా సకాలంలో ఎరువులు అందించామన్నారు. కానీ కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులకు రైతుభరోసా కేంద్రాల ద్వారా యూరియా మందులను పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, జడ్పీటీసీ సభ్యులు బద్దెల రాజ్‌కుమార్, డోన్, బనగానపల్లె నియోజకవర్గ వైసీపీ నాయకులు పోస్టు ప్రసాద్, సో మేష్ యాదవ్, మల్లికార్జున రెడ్డి, చల్లా విఘ్నేశ్వరరెడ్డి, తిరు పాల్ రెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి

డోన్ రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టళ్ల వార్డెన్లు బాధ్యతగా విధులు నిర్వహించాలని పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా అన్నారు. మంగళవారం పట్టణ సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో నియోజకవర్గంలోని సంక్షేమ హాస్టళ్ల వార్డెన్లతో సమావేశమయ్యారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థుల స్థితిగతులు, మానసిక స్థితిని పరిశీలిస్తూ వారికి అవసరమైన కౌన్సెలింగ్ చేయాలన్నారు. అవసరమైతే విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించి వారిని అప్రమత్తం చేయాలన్నారు. సమావేశంలో పట్టణంలోని బాలుర, బాలికల సంక్షేమ హాస్టళ్ల వార్డెన్లు ఎం.మధు, అమర్నాథ రెడ్డి, సూర్యకుమారి అలియాస్ మేరీ, సువర్ణ తదితర వార్డెన్లు ఉన్నారు.

రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీతకు సత్కారం


తెలుగు పండిట్‌ను సన్మానిస్తున్న హెచ్ఎం, ఏడీ, యువకులు

చాగలమర్రి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామం లోని బాలికోన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు, రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డుగ్రహీత లక్ష్మయ్యను తెలుగుయువత అధ్యక్షుడు మాబులాల్, పశుసంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్, పాఠశాల హెచ్ఎం శివలక్ష్మి, ఉపాధ్యాయులు మంగళవారం సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పశువైద్య సిబ్బంది, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

రుద్రవరం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ భవనంలో గురువారం మండల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో సుబ్రమణ్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బాలస్వామి అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలస్థాయి అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొనాలని కోరారు.

అభయాంజనేయస్వామికి విశేష పూజలు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బెలుం గ్రామ సమీపంలో ప్రధాన రహదారిలో వెలసిన అభయాంజనేయస్వామికి విశేష పూజలు చేశారు. భాద్రపద మాసం, కృష్ణపక్షం మంగళవారం సందర్భంగా అభయాంజనేయస్వామితో పాటు మండలంలోని బెలుం, మీర్జాపురం, అంకిరెడ్డిపల్లె, కల్వటాల తదితర గ్రామాల ఆంజనేయ స్వామి ఆలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి ప్రీతికరమైన పంచామృతాభిషేకం, ఆకుపూజ, ప్రత్యేక అలంకరణ చేపట్టారు.

పంచాయతీలకు నిధులు మంజూరు

దొర్నిపాడు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 11 గ్రామ పంచాయతీలకు 2024-225 ఆర్థిక సంవత్సరం రెండో విడత 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలైనట్లు ఎంపీడీవో సావిత్రి తెలిపారు. ఆమె మాట్లాడుతూ నిధులను గ్రామ పంచాయతీల్లోని పారిశుధ్యం, అభివృద్ధి పనులు, తాగునీరు మరమ్మతులకు వినియోగించాలని ఎంపీడీవో సూచించారు.

మహిళ అదృశ్యం

సంజామల, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలో ఓ గ్రామానికి చెందిన మహిళ అదృశ్యమైన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమణయ్య మంగళవారం తెలిపారు. తల్లిదండ్రులు, ఆమె భర్త పలుచోట్ల వెతికిన ఆచూకీ లభ్యం కాకపోవడంతో సంజామల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థి మృతిపై ఎమ్మెల్యే విచారం

డోన్ టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీరామ్ నగర్ బీసీ హాస్టల్ విద్యార్థి శ్యామ్ సుందర్ సోమవారం ఆత్మహత్య చేసుకోవడంపై ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. మంగళవారం బీసీ హాస్టల్‌ను పరిశీలించారు. సంఘటనకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సచివాలయాల్లో
సమయ పాలన ఏదీ?

- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- డిజిటల్ అసిస్టెంట్ లేక అందని సేవలు
- చోద్యం చూస్తున్న అధికారులు

చాగలమర్రి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన సచివాలయాల్లో సరైన సేవలు అందడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సచివాలయాల ఉద్యోగులు ఎప్పుడు వస్తారో వెళ్తారో తెలియడం లేదని పలువురు వాపోతున్నారు. మంగళవారం ఉదయం 11:30గంటలకు మండల కేంద్రంలోని 3, 4, 5 సచివాలయాలను 'ఆంధ్రజ్యోతి' విజిట్ చేసింది. మూడవ సచివాలయంలో ముగ్గురు, నాలుగవ సచివాలయంలో ఇద్దరు, ఐదవ సచివాలయంలో ఇద్దరు మాత్రమే విధుల్లో ఉన్నారు. మిగిలిన ఆయాశాఖల ఉద్యోగులు లేకపోవడంతో ఖాళీ కుర్చీలు కనిపించాయి. సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజలు సంబంధిత అధికారులు లేక వెనుతిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. 5వ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ బదిలీపై వెళ్లడంతో ఆ పోస్టు భర్తీ కాలేదు. దీంతో ప్రజలకు డిజిటల్ సేవలు అందడం లేదు. 4వ సచివాలయంలో వారం రోజులుగా ఆధార్ కేంద్రం పని చేయకపోవడంతో వెనుదిరుగుతున్నట్లు ప్రజలు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించేలా చూడాలని పలువురు కోరుతున్నారు.


ఐదవ సచివాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు


సచివాలయంలో పని చేయని ఆధార్ కేంద్రం

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి


డ్రమ్మును పరిశీలిస్తున్న డోన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి

డోన్ రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని డోన్ మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని బుడగజంగాల కాలనీలో డెంగీ, మలేరియా జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలన్నారు. జ్వరాలతో బాధపడుతున్న వారికి రక్తపరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మధుసూదన్‌రావు, అమర్నాథ్, సచివాలయ ఏఎన్ఎం సునీత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు చర్యలు

చాగలమర్రి: మండల కేంద్రంలోని చాగలమ్మ చెంచు కాలనీలో దోమల నియంత్రణకు వైద్యశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఆళ్లగడ్డ సబ్‌యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి, వైద్యులు అంజలి పర్యవేక్షణలో ఇంటింటికి వెళ్లి నిల్వ ఉన్న నీటిని పారబోశారు. చెంచులకు జ్వరాలు ఉన్న విషయం తెలుసుకొని ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రమణమ్మ, హెచ్ఈ విజయభారతి, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, హెచ్ఈ మనోహర్, ఏఎన్ఎం గార్లేట్, అంగన్‌వాడీ వర్కర్ సుజాత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


చెంచుగూడెంలో పిచికారీ చేయిస్తున్న వైద్యాధికారులు

ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు చేయాలి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఇంటింటి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించాలని వైద్యాధికారి హరిచరణ్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీ కేంద్రంలో 12 గ్రామ సచివాలయాల పరిధిలోని ఏఎన్ఎంలు, ఇతర వైద్య సిబ్బందితో వైరల్ ఫీవర్స్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రస్తుతం మండలంలో సాధారణ జ్వరాలు తప్ప ఎటువంటి ఆందోళన కలిగించే విషజ్వరాలు లేవని, ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. అవసరమైతే గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తామని సూచించారు. సమావేశంలో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైద్యాధికారి హరిచరణ్‌రెడ్డి

ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

బేతంచెర్ల, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య కోరారు. మంగళవారం పట్టణంలోని రైల్వేస్టేషన్ ఆవరణం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఆటో వర్కర్స్ యూనియన్ నాయకుడు మద్దిలేటి, పుల్లయ్య ఆధ్వర్యంలో ఆటోలతో ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ నాగమణికి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నత చదువులు చదివి ఉద్యోగ, ఉపాధి లేక నిరుద్యోగ యువకులు ఆటో డ్రైవర్లుగా మారుతున్నారన్నారు. ప్రైవేట్ ఫైనాన్సియర్స్ దగ్గర అధిక వడ్డీలకు అప్పులు చేసి ఆటోలను కొనుగోలు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. ప్రభుత్వం స్త్రీ శక్తి పేరుతో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కలిపించి ఆటో డ్రైవర్ల కడుపు కొట్టుతోందన్నారు. వెంటనే ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తిరుమలేష్, సాలయ్య, నారాయణ, రామచంద్రుడు, నాగేశ్వరరావు, ప్రసాద్, మద్దిలేటి, వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, ఎల్లయ్య, సురేంద్ర, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇద్దరు దొంగలు అరెస్టు

- బోరు మోటారు, కేబుల్ వైరు స్వాధీనం

బేతంచెర్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దవరం గ్రామంలో రెండు రోజుల క్రితం జరిగిన రెండు దొంగతనం కేసుల్లో ఇద్దరు దొంగలను అరెస్టు చేసి బోరు మోటారు, కేబుల్ వైర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు మంగళవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన మేరకు గ్రామం సమీపం పొలాల్లో ఈ నెల 5, 6 తేదీల్లో గ్రామానికి చెందిన తిమ్మగురుడు బోరు మోటారు, సుబ్బారెడ్డి చెందిన కేబుల్ వైర్‌ను ఇద్దరు వ్యక్తులు దొంగతనం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మంగళవారం సాయంత్రం నిందితులు ఇద్దరు సిమెంటునగర్ ఆంజనేయ స్వామి దేవాలయం సమీపంలో మోటారు సైకిల్‌పై వెళ్తుండగా.. అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి బోరు మోటారును, విద్యుత్ కేబుల్ వైర్‌ను స్వాధీనం చేసుకుని డోన్ కోర్టులో హాజరు పరచగా.. మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారని ఎస్ఐ తెలిపారు.

నూతన ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న రామసుబ్బారెడ్డి

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): తమ కళాశాలలో చదివిన 15మందికి మెగా డీఎస్సీలో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలు రావడం హర్షనీయమని అనంత విద్యాసంస్థ అధినేత అనంత రామసుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం అనంత కళాశాల అవరణంలో అభినందన సభ నిర్వహించి ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో చదువుకున్న 15 మందికి ఒకే సారి ఉద్యోగాలు రావడం ఎంతో గర్వాకారణంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ అనంత విజయలక్ష్మి, కోట కందుకూరు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎర్రమల రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


డీఈకి వినతి పత్రం అందిస్తున్న డివిజన్ జేఏసీ చైర్మన్ రామకృష్ణ, ఉద్యోగులు

డోన్ టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డోన్ డివిజన్ జేఏసీ చైర్మన్ రామకృష్ణ కోరారు. మంగళవారం డివిజనల్ ఇంజనీర్ కమలాకర్ రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగదు రహిత వైద్యం, పాత పెన్షన్ విధానం, అలాగే కాంట్రాక్టు కార్మికులకు 2022 పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 15న ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని జేఏసీ చైర్మన్ రామకృష్ణ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జేఏసీ సభ్యుడు మద్దిలేటి, ఉద్యోగులు పాల్గొన్నారు.

పాఠశాలలకు బీరువాలు, ర్యాక్‌ల విరాళం

చాగలమర్రి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలలకు బీరువాలు, ర్యాక్‌లను పీఆర్టీయూ నాయకులు విరాళం అందజేశారు. మంగళవారం పీఆర్టీయూ రాష్ట్ర కౌన్సిలర్, బి.రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో మద్దూరు, చిన్నవంగలి ఉన్నత పాఠశాలలకు బీరువాలు, చాగలమర్రి బాలుర, బాలికల, గొడిగనూరు ఉన్నత పాఠశాలలకు ర్యాక్‌లు అందజేశారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు పీఆర్టీయూ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ అధ్యక్షుడు మౌలాలి, జిల్లా, మండల నాయకులు నారాయణమూర్తి, రవిప్రకాష్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, షరీఫ్, దస్తగిరి, శివరామకృష్ణ, సురేష్‌బాబు, శ్రీనివాసులు, మోహన్‌రాజు, రాజ్‌కుమార్, హెచ్ఎంలు జీవయ్య, శివలక్ష్మి, మహబూబ్‌బాష, సుధాకర్‌గుప్త, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువైద్య కేంద్రాల తనిఖీ

చాగలమర్రి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నవంగలి పశువైద్యశాలను పశుసంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్ మంగళవారం తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 15 నుంచి గ్రామాల్లో గాలికుంటువ్యాధి నివారణ టీకాలు పశువులకు వేస్తున్నామన్నారు. మండలానికి 12 మెట్రిక్ టన్నుల సమీకృత దాణను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి దీపకుమారి, సిబ్బంది ఉన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

చాగలమర్రి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో రంగనేతాజీ సూచించారు. మంగళవారం శెట్టివీడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నానో యూరియా వినియోగంపై అవగాహన

శిరివెళ్ల, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి) : నానో యూరియాను వినియోగించడం ద్వారా మేలైన దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి సుధాకర్ సూచించారు. మంగళవారం మండలంలోని వెంకటేశ్వరాపురం గ్రామ రైతులకు నానో యూరియా ఉపయోగాలు, వినియోగించే విధానంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఏపీ నూర్‌బాషా కార్పొరేషన్ డైరెక్టర్‌గా కాశీంబాబు



బనగానపల్లె, సెప్టెంబరు 9, (ఆంధ్రజ్యోతి) : ఏపీ నూర్‌బాషా కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా టీడీపీ పట్టణ అధ్యక్షుడు దూదేకుల మహబూబ్ కాశీంబాబును నియమిస్తూ టీడీపీ అధిష్ఠానం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పట్టణ అధ్యక్షుడిగా క్రియాశీలకంగా వ్యవహరిస్తూ టీడీపీ బలోపేతం చేసే నాయకుడిగా ఎదిగిన కాశీంబాబు సేవలను గుర్తించి ఈ పదవి వర్తించింది. ఈసందర్భంగా తనను దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించడానికి కృషి చేసిన రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి రుణపడి ఉంటానన్నారు. సీఎం చంద్రబాబునాయుడుకు కాశీంబాబు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో టీడీపీ అభివృద్ధి కోసం శాయశక్తులా కృషి చేస్తామన్నారు. కాశీంబాబును పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): దూదేకుల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని జనసేనా పార్టీ మండల అధ్యక్షుడు డీకే. బాబు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూదేకుల, నూర్‌బాష కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి 15 మందికి డైరెక్టర్ పదవులు ఇచ్చిన సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్‌గా బనగానపల్లె నియోజకవర్గానికి చెందిన మహబూబ్ కాశీంకు శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

రుద్రవరం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అంగన్‌వాడీలకు అన్ని రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తామని, అధికారం చేపట్టిన తరువాత అన్యాయం చేశారని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు ఆరోపించారు. మంగళవారం రుద్రవరంలో సీఐటీయూ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. పేరుమాత్రమే అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులు అంటున్నారన్నారు. సరైనా జీతాలు లేక దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చి వేతనాలు పెంచుతామని చెప్పి, గతంలో ఇచ్చే సంక్షేమ పథకాలన్నింటిని కూడా అమలు చేయకుండా నిలిపి వేయడం శోచనీయమన్నారు. వెంటనే జీతాలు పెంచాలని కోరారు. అ లాగే ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు రామచంద్రుడు పాల్గొన్నారు.

లొక్కిగుండం క్షేత్రంలో
మందుబాబుల హల్‌చల్


మందుబాబులు పడేసిన సీసాలు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి అందాలు, జలపాతాలతో విరాజిల్లే లొక్కిగుండం రామేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కొద్ది రోజులుగా మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారు. అటు అనంతపురం, ఇటు నంద్యాల జిల్లాల సరిహద్దులో ఉండటం, కొండ ప్రాంతం కావడంతో మందుబాబులు ఆలయ పరిసరాల్లో మద్యం తాగుతూ పేకాట, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుండటంతో భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఎవరైనా మందుబాబులకు అడ్డు చెబితే దాడులకు పాల్పడుతున్నారని అర్చకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు మందుబాబుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని భక్తులు కోరుతున్నారు.

ఏడాదిన్నరలోనే దెబ్బతిన్న రోడ్డు

రుద్రవరం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పేరూరు నుంచి చందలూరు గ్రామం మధ్య బీటీ రోడ్డు దెబ్బతిన్నది. ఈ రోడ్డును ఏడాదిన్నర క్రితం వేశారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించకపోవడంతో శిథిలమైందని వాహనదారులు ఆరోపిస్తున్నారు. రాకపోకలకు ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు. బీటీ రోడ్డు నిర్మించారని ఆనంద పడ్డాం.. ఆ ఆనందం నెలలలోనే ఆవిరైపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధ్వంసమైన రోడ్డుకు మరమ్మతులు చేయించాలని గ్రామీణులు కోరుతున్నారు.


పేరూరు సమీపంలో దెబ్బతిన్న ఆర్అండ్‌బీ రోడ్డు

స్వచ్ఛత ఏదీ?


రహదారిలో నిలిచిన మురుగు నీరు

చాగలమర్రి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని ముత్యాలపాడు బస్టాండు సమీపంలో మురుగు సమస్య తీవ్రంగా ఉన్నది. ప్రధాన కాలువలోకి మురుగు నీరు పారే వీలు లేకుండా నిర్మించడం ప్రధాన సమస్య. పైగా కాలువలు పూడికతో నిండిపోయాయి. సమస్య ను అధికారులు పట్టించుకోకపోవడంతో రహదారి మురుగు కుంటగా మారింది. దీంతో దోమలు అధికమై ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి మురుగు నీరు తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రహదారికి ఇరువైపులా కంప చెట్లు

బేతంచెర్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల-వెల్దుర్తి రహదారికి ఇరువైపులా కంప చెట్లు ఏపుగా పెరిగాయి. ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గతంలో ప్రమాదాలకు గురైన సంఘటనలు కూడా ఉన్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు వెల్దుర్తి రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంప చెట్లను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.


రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంప చెట్లు